Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

విశాఖ సమాచారము

WANTED
Office Assistant-1
Jr. Accountant-1
For an Audit Firm
at Seethammadhara
Call : 95334 94102

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 121 విశాఖపట్నం, 18 ఫిబ్రవరి 2024 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

మిలాన్ - 2024 ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా జరగనున్న మిలాన్ - 2024 వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున పరిశీలించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ విశ్వనాథన్, ఇతర అధికారులతో కలిసి బీచ్ రోడ్లో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. మిలాన్ వేడుకల విజయవంతానికి పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్ - 2024 కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో నేవీ వైపు నుంచి ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు జరిగే బ్రైల్ రన్ వేడుకల గురించి కూడా తెలుసుకున్నారు. వేడుకలను వీక్షించేందుకు లక్షలాది మంది ప్రజలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం

(మిగతా 2లో)

పార్టీ విజయమే లక్ష్యంగా కార్యాచరణ : అమర్నాథ్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రానున్న ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు చేపట్టవలసిన కార్యాచరణపై 34 నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ అబ్జర్వర్లతో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ సమాలోచనలు జరిపారని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి, వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లాల డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ చెప్పారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సమావేశం అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ 60 రోజుల్లో రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్య భూమిక పోషించనున్నారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల సమయంలో బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణకు సంబంధించి మార్గదర్శకం చేశారని అమర్నాథ్ తెలియజేశారు. 2019లో ఎన్నికల్లో కన్నా, మరిన్ని ఎక్కువ సీట్లు ఉత్తరాంధ్రలో గెలుచుకోవాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగేలా శ్రేణులను సిద్ధం చేస్తున్నామని ఆయన చెప్పారు. గత ఎన్నికల్లో విశాఖ నగరంలో వైసిపి పెద్దగా సీట్లను దక్కించుకోవడంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అమర్నాథ్ సమాధానం చెబుతూ,

(మిగతా 2లో)

చంద్రబాబు పై సీఐడీ ఛార్జిషీట్

ఏపీలో ఎన్నికల వేళ చంద్రబాబు కేసుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏపీ ఫైబర్ నెట్ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేసింది ఏపీ సీఐడీ. అందులో ఏ1 గా చంద్రబాబు నాయుడు, ఏ2గా వేమూరి హరి కృష్ణ, ఏ3గా కోగంటి సాంబ శివ రావులను చేర్చింది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ. 330 కోట్లు కాగా రూ. 114 కోట్లు చంద్రబాబు

(మిగతా 2లో)

ఈడీ కేసులో కోర్టు విచారణకు కేజ్రీవాల్

దేశాన్ని కుదిపేసిన ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో కీలక పరిణామం సంభవించింది. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎట్టకేలకు విచారణకు హాజరయ్యారు. ఢిల్లీ రోజ్ అవెన్యూ న్యాయస్థానంలో వీడియో కాన్ఫరెన్స్ రూపంలో విచారణను ఎదుర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇప్పటికే అయిదుసార్లు అరవింద్ కేజ్రీవాల్‌కు

(మిగతా 2లో)

రెబల్ ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు.. 19న తుది విచారణ..!

అమరావతి: వైసీపీ రెబల్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఈ నెల 19వ తేదీన తుది విచారణకు సిద్ధం అవుతున్నారు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం.

మరోసారి రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు.. వైసీపీ రెబెల్స్ ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలకు తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు స్పీకర్. ఈ నెల

(మిగతా 2లో)

పని ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): పని చేసే ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలని, సురక్షితమైన పని వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విశాఖపట్టణం మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్. శ్రీదేవి సూచించారు. మహిళల హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు భాగస్వామ్యమయ్యారు.

విశాఖపట్టణం మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ చట్టం తాలూక ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని,

(మిగతా 2లో)

ప్రత్యేక హోదా ఇవ్వలేదనే ఆనాడు బీజేపీతో విభేదించాను



ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదనే ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో విభేదించానని టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. ప్రజల కోసమే తాను ఆ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా ఇంకొల్లులో నిర్వహించిన రా కదలిరా సభలో ఆయన ప్రసంగించారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కేంద్రం సాయం చేస్తామన్నా, ఆ సాయం అందుకోలేని స్థితిలో జగన్ ఉన్నారని చంద్రబాబు విమర్శించారు.

ఇది పోయే ప్రభుత్వం... పోలీసులు కూడా మునిగిపోతారు!

ఇంకొల్లులో రా కదలిరా సభను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇది పోయే ప్రభుత్వం... ఇలాంటి ప్రభుత్వాన్ని మోయాలని చూస్తే పోలీసులు కూడా మునిగిపోతారు. నోటీసుల్లో ఏం ఉందో చూడకుండానే సభ ఆపాలని ఎస్పీ అంటారా? మేం చట్టానికి లోబడే సభ ఏర్పాటు చేసుకున్నాం. అన్యాయంగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే తొక్కుకుంటూ వెళతాం... అని చంద్రబాబు స్పష్టం చేశారు.

సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడకు అనుమతి లేదు: డీసీపీ

విజయవాడ, (విశాఖ సమాచారమ్): సీపీఎస్ ఉద్యోగులు ఆదివారం నిర్వహించతలపెట్టిన చలో విజయవాడకు అనుమతులు లేవని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నగరంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా సీపీఎస్ ఉద్యోగుల కార్యక్రమానికి అనుమతులు ఇవ్వలేమన్నారు.

చలో విజయవాడకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు లేనందువల్ల ఎవరూ విజయవాడకు రావొద్దని సూచించారు. నగరంలో సెక్షన్ 30, 144 అమల్లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చలో విజయవాడలో పాల్గనవొద్దని సూచించారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘించి పాల్గొంటే అరెస్టులు తప్పవని స్పష్టం చేశారు.

సింహగిరిపై అభివృద్ధి జోరు

రూ.10 లక్షలతో సహస్ర దీపాలంకరణ సేవ కౌంటర్

సింహాచలం, (విశాఖ సమాచారమ్): సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అనేక అభివృద్ధి పనులు చేపట్టాలని ధర్మకర్తల మండలి, ఆలయ ఇవో ఎన్.శ్రీనివాసమూర్తి భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇటీవల కాలంలో పలు అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే రూ.54 కోట్లతో ప్రసాద్ పథకం పనులకు నేడో రేపో శంకుస్థాపన చేయనుండగా శ్రీనివాసనగర్ లో నిర్మించిన కళ్యాణ మండపాల సముదాయాన్ని త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా సింహగిరిపైన భక్తుల సౌకర్యార్థం సహస్ర దీపాలంకరణ అర్చిత సేవ నిర్వహించడానికి ప్రత్యేక నిర్మాణాలు గావిస్తున్నారు. ఇందు కోసం రూ.10 లక్షలతో పనులు పూర్తి చేయనున్నారు. మరో వైపు సింహగిరిపైన త్రిపురాంతకస్వామి ఆలయం సమీపంలో సింహాద్రినాథుడు, శ్రీదేవి, భూదేవి విహరించే వాహనాలను భక్తులు తిలకించే విధంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు వాహన శాలను ఏర్పాటు చేయనున్నారు.. సుమారు రూ.10లక్షలతో ఆయా పనులు పూర్తి చేయనున్నారు. ఆయా రెండు పనులను దాతలు సహకారంతో చేపట్టనున్నారు... ఈ రెండు పనులకు సంబంధించి శనివారం ఆలయ ఇవో ఎన్.శ్రీనివాసమూర్తి

(మిగతా 2లో)

విశాఖ శారదాపీఠంలో విష్ణు సహస్రనామ పారాయణ

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి అనుష్ఠాన దైవం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను శనివారం విశేషంగా అలరించారు. వల్లీ, దేవసేన సమేతుడై దర్శనమిచ్చిన సుబ్రహ్మణ్య స్వామి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్లు ఈ అలంకరణను తీర్చిదిద్దారు. ఉత్సవ విగ్రహాలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు హారతులిచ్చి పూజలు చేసారు. మరోపక్క పారాయణ మహాయజ్ఞంలో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్థానిక భజన మండళ్ళు, భక్త బృందాలు పెద్ద ఎత్తున పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మరోపక్క లోక కళ్యాణార్థం చేపట్టిన మహారుద్ర సహిత రాజశ్యామల యాగం మూడో రోజు కూడా కొనసాగింది. భక్తులకు ఆయురారోగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షిస్తూ వార్షికోత్సవాల్లో మన్యుసూక్త హోమం నిర్వహించారు. పీఠ ప్రాంగణంలోని రాజశ్యామల, దక్షిణామూర్తి, వనదుర్గ, దాసాంజనేయ స్వామి, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చంద్రమౌళీశ్వర స్వామి, కాలభైరవ స్వామి ఆలయాలను సందర్శించిన పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

స్వాములు పూజలు నిర్వహించారు.



కొణతాలతో కొణిదెల భేటీ

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జనసేన నాయకులు కొణిదెల నాగబాబు మర్యాద పూర్వకంగా కొణతాల రామకృష్ణ నివాసంలో మాజీమంత్రి జనసేన నాయకులు కొణతాల రామకృష్ణ తో భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకు, పార్టీ బలోపేతానికి సుదీర్ఘంగా చర్చించారు. వీరితోపాటు రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఉత్తరాంధ్ర నాయకులు సుందరపు సతీష్ కుమార్ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఏబీయూసి ఆధ్వర్యంలో కార్మికుల రాస్తారోకో

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): దేశంలోని కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ఏబీయుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి ఏసుదాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఆందోళనలో భాగంగా యలమంచిలి కార్మిక సంఘం ఏబీయూసీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ర్యాలి, రాస్తారోకో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మోటార్ చట్టం, రైతు, కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ప్రజలపై భారాన్ని తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ నాయకులు బంగారు అప్పలనాయుడు, బీ వరప్రసాద్, గణేష్ రాజు, మున్సిపల్ ముఠా నాయకులు దిగువమర్తి మహేష్, ఉరిగుల చంద్రరావు, వీసం వెంకటరమణ, దిమిలి ఆటో అధ్యక్షులు లక్ష బాబు, పి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గొలిపట్టంలో ఇంటింటి కొళాయి ప్రారంభం

చోడవరం, (విశాఖ సమాచారమ్): చోడవరం మండలం గొలిపట్టం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటి కులాయి, వాటర్ ట్యాంక్ ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకుందని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు ఈ ఇంటికి కొళాయి ఎంతో ఉపయోగకరమని అన్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులకు శిక్షణా కార్యక్రమం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాబోవు సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా విధులు నిర్వహించుటకు ప్రణాళికా బద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి శనివారం అనకాపల్లి రోటరీ క్లబ్ సమావేశ హాలు నందు అదనపు ఎస్పీ గారు ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు.శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను అదనపు ఎస్పీ గారు స్వయంగా వివరించారు. ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలు, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, ఎలక్షన్ సంబంధిత చట్టాలు మరియు నేరాలు, అక్రమ గంజాయి రవాణా, మద్యం, నగదు మరియు ఇతర వస్తువులు సీజ్ చేయు ప్రక్రియ, తరచూ గ్రామాలు సందర్శించి సమాచారం సేకరించడం, అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసులకు ఉన్న సందేహాలను అదనపు ఎస్పీ నివృత్తి చేసారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజు పోలింగ్ తరువాత తీసుకోవలసిన చర్యలు గూర్చి మరియు రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికా బద్ధంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటినుండి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు పోలీసు ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికల కమిషన్ నియమ నిబంధన మేరకు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, ఇతర శాఖల అధికారులు సిబ్బందితో సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించుటకు కృషి చెయ్యాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పి కె.వి.సత్యనారాయణ, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పి వి.సుబ్బరాజు, ట్రైని డీఎస్పి భవ్య, ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి మరియు జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాంగం

ఆదివారం 18-02-2024
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం ,శిశిర ఋతువు
మాఘ మాసం

తిథి	: శు. నవమి ప. 12.22
నక్షత్రం	: రోహిణి ప. 01.21
వర్జ్యం	: రా. 07.00 ల 08.36

టిడ్కో గృహాల వద్ద నేడు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): పట్టణ మున్సిపాలిటీకి చెందిన శ్రీ రామ్ నగర్ కాలనీల వద్ద నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో నేడు ఉదయం 10:30ని.లకు శ్రీ శ్రీ శ్రీ భక్తాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సుమారు 2000 మందికి టిడ్కో గృహ యజమానులు, దాతల సహకారంతో భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరై స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని టిడ్కో గృహ యజమానులు కోరారు.

గ్రామ గ్రామానికి ప్రాధాన్యత- గడప గడపకు సంక్షేమాభివృద్ధి

కె.కోటపాడు:మండలంలో ప్రతి గ్రామానికి ప్రాధాన్యత భవనాలు రోడ్లు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ గడప గడపలో సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవనాన్ని మరింత అభివృద్ధి వైపు మలచే విధంగా వైసీపీ ప్రభుత్వ పాలన కొనసాగు తుందని, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. పారిసేవల నిమిత్తం గ్రామాల్లో రూపుదిద్దుకున్న సచివాలయం భవనాలను, రైతులకు మెరుగైన సేవలందించే దిశగా ఏర్పడిన రైతు భరోసా కేంద్రాలను, గ్రామాల్లోనే ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లను, గ్రామీణ ప్రజా నీటి అవసరాల నిమిత్తం ప్రతి ఇంటికి కుళాయిలను స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వాయంతో మంత్రి ప్రారంభించారు.

మేడివర్ల గ్రామంలో సిసి రోడ్లను , వాటర్ ట్యాంక్

రొంగాలినాయుడు పాలెం గ్రామంలో 43.60 లక్షల రూపాయల నిధులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, 23.94 లక్షల రూపాయల వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, 20.80 లక్షల రూపాయల వ్యయంతో వైఎస్ఆర్ గ్రామీణ హాస్పటల్ (క్లినిక్ హెల్త్ సెంటర్)ను, ప్రారంభించారు.

చౌడువాడ గ్రామంలో 43.60 లక్షల రూపాయల నిధులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని , 23.94 లక్షల రూపాయల వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, 20.80 లక్షల రూపాయల వ్యయంతో వైఎస్ఆర్ గ్రామీణ హాస్పటల్ (క్లినిక్ హెల్త్ సెంటర్)ను ప్రారంభించారు.

మల్లం పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 60 లక్షల రూపాయిల నిధులతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను, ఇంటింటి కుళాయిలు ప్రారంభించారు.

అర్లి గ్రామంలో రూపాయలతో నిధులతో నిర్మించిన జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటైలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు, గ్రామ సచివాలయ భవనాన్ని , ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

దాలివలస గ్రామంలో 43.60 లక్షల రూపాయల నిధులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని , గ్రామ సచివాలయ భవనాన్ని , ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటైలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు అదనపు నీటి అవసరాల నిమిత్తం వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు.

పాతవలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటైలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు అదనపు నీటి అవసరాల నిమిత్తం వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, మండలగ్రామ స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయిలు)

మిలాన్ - 2024 ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కలగకుండా పలు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించారు. బీచ్ రోడ్డులో మొత్తం 30 ఎన్ క్లేజర్లు, 30 ఎల్.ఈ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేశామని నేవీ అధికారులు కలెక్టర్ కు వివరించారు. అదే మాదిరిగా సామాన్య ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ వైపు కూడా ఎల్.ఈ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అటు ఏపీపీలకు, ఇటు సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

పీపీపీ, పీపీపీ రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ ఏరియాలో బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి, బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో భాగంగా ముందుగా ఆయా విభాగాల అధికారులు వేడుకలు జరిగే ప్రాంతాల్లో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని సూచించారు. సీసీ టీవీ కెమెరాలు, ఎల్.ఈ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఏపీఐఐసీ, ఏయూ గ్రౌండ్స్‌లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు రానున్న నేపథ్యంలో ఎలాంటి లోపం జరగకుండా అన్ని విభాగాల అధికారులు, నేవీ అధికారులు సమన్వయం వహించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని, వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

జీవీఎంసీ సీఎం సాయికాంత్ వర్మ, పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, పోలీసు అధికారులు వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ & బి, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీలతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా కార్యాచరణ : అమర్నాథ్

చాలా కాలంగా విశాఖ నగరంలో వైసీపీపై దుష్ప్రచారం సాగిందని, కానీ ఇప్పుడు ఇక్కడి ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని, వైసీపీని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని, గతంలో చేసిన తప్పిదాలను ఇప్పుడు చేయమంటూ ప్రజలు పార్టీకి భరోసా ఇస్తున్నారని మంత్రి అమర్నాథ్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైసీపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ప్రజలు ఉన్నారని అమర్నాథ్ స్పష్టం చేశారు. కాగా ఈ సమావేశంలో ఇటీవల భీమిలిలో జరిగిన సిద్ధం సభ విజయవంతం చేసినందుకు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు పార్టీ నాయకులకు సుబ్బారెడ్డి అభినందనలు తెలియజేశారని ఆయన చెప్పారు.

లోకేష్ పదేపదే రెడ్ బుక్ చూపడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంచి అమర్నాథ్ సమాధానం చెబుతూ, లోకేష్ చిన్నప్పుడు చదువుకుంటే ఇప్పుడు నోరు తిరిగేదని, నోరు తిరగని లోకేష్ ఏం మాట్లాడుతున్నాడో అయనకే అర్థం కావట్లేదని అమర్నాథ్ అన్నారు. వైసీపీ పని అయిపోయింది అంటూ లోకేష్ కుర్చీ మడత పెట్టడంపై మంత్రి స్పందిస్తూ.. లోకేష్ నాలుక మడత పడిందని, ముందు దాన్ని సరిచేసుకోవాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డి దెబ్బకు చంద్రబాబుకు, లోకేష్ కు నాలుక మడత పడిందని, వచ్చే ఎన్నికల్లో బాబు కుర్చీ కూడా మడత పడిపోతుందని మంత్రి అమర్నాథ్ జోస్యం చెప్పారు.

చంద్రబాబు పై సీఐడీ కేసుల్లో కీలక పరిణామం..!

కారణంగా నష్టం వాటిల్లిందని ఆరోపించారు. చంద్రబాబు కనుసన్నల్లోనే ఫైబర్ నెట్ స్కాం జరిగిందని ఏపీ సీఐడీ చార్జ్ షీట్లో పేర్కొంది.

చంద్రబాబును సీఐడీ కేసులు వెంటాడుతున్నాయి. మొత్తం రూ.2 వేల కోట్ల ఈ ప్రాజెక్టు కింద మొదటి దశలో రూ.333 కోట్ల ఎలివైన పనుల్లో అక్రమాలను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు, లోకేశ్‌కు సన్నిహితుడైన వేమూరి హరికృష్ణకు చెందిన "టెరా సాఫ్ట్' కంపెనీకి టెండర్లు కట్టబెట్టారని అభియోగాలు నమోదు చేసింది. ఈ మేరకు సీఐడీ.. ఏసీబీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. చంద్రబాబు కనుసన్నల్లోనే ఫైబర్ నెట్ స్కాం జరిగిందని ఏపీ సీఐడీ చార్జ్ షీట్లో వివరించింది.

వేమూరి హరి కృష్ణని నిబంధనలకు విరుద్ధంగా ఫైబర్ నెట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారని తెలిపింది. ఉద్దేశ పూర్వకంగానే చంద్రబాబు.. హరి కృష్ణని నియమించారని తెలిపింది. విధి విధానాలు పాటించకుండా ఫైబర్ నెట్ ప్రాజెక్ట్?కు చంద్రబాబు అనుమతులు ఇచ్చారని పేర్కొంది. ప్రాజెక్ట్?ను వేమూరి హరి కృష్ణకు ఇచ్చేలా ప్రాజెక్ట్ అధికారులపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు సీఐడీ అధికారులు. టెండర్ల ఎస్టిమేషన్ కమిటీలో హరి ప్రసాద్‌ను నియమించాలని చంద్రబాబు ఒత్తిడి తెచ్చారని ఆరోపించింది. వేమూరి హరి కృష్ణ టేరాసాఫ్ట్ కంపెనీని బ్లాక్ లిస్టులో నుంచి తొలగించాలని ఒత్తిడి తెచ్చి టేరా సాఫుకు ఈ ప్రాజెక్ట్ వచ్చేలా ప్లాన్ చేశారని పేర్కొంది. మిగతా కంపెనీలు టెండర్ దాఖలు చేసిన వాళ్ళని కాదని వేమూరి హరి కృష్ణకు టెండర్ దక్కేలా చేశారని చెప్పింది.

సీనియర్ జేఎంఎస్ అధికారి టెండర్ ప్రక్రియలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని చూస్తే అరెస్టు చేశారని తెలిపింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబుకు ఎసిబి కోర్టు, ఏపీ హై కోర్టు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. చంద్రబాబు ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఫైబర్ నెట్ కేసుపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు సీఐడీ తన ఛార్జ్ షీట్‌లో పొందుపరిచింది.

ఈడీ కేసులో కార్తి విచారణకు హాజరైన ముఖ్యమంత్రి

సమన్లను జారీ చేసిన విషయం తెలిసిందే. శనివారం విచారణకు హాజరు కావాలంటూ మరోసారి ఆదేశాలు ఇచ్చారు. విచారణలో భాగంగా ఉదయం తమ కార్యాలయానికి రావాల్సి ఉంటుందంటూ సూచించినప్పటికీ- ఆయన మాత్రం గైర్హాజరయ్యారు.

ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు ఢిల్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణకు హాజరయ్యేలా కేజ్రీవాల్‌కు ఆదేశాలను జారీ చేయాలంటూ పిటిషన్లను దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించింది ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టు. కేజ్రీవాల్‌కు సమన్లను జారీ చేసింది.

ఈ నేపథ్యంలో- తప్పనిసరిగా విచారణకు హాజరయ్యారాయన. వీడియో కాన్ఫరెన్స్ రూపంలో విచారణను ఎదుర్కొన్నారు. తాను స్వయంగా కోర్టుకు రాలేకపోతున్నానని వివరించారు. దీనికి గల కారణాలను వివరించారు. ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు.

ఈ విశ్వాస తీర్మానంపై సభలో ఓటింగ్ జరగాల్సి ఉన్నందున తాను వ్యక్తిగతంగా న్యాయస్థానానికి హాజరు కాలేకపోతున్నానని వివరణ ఇచ్చారు. గతంలో ఇదే ఈడీ అధికారులు.. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారించిన విషయం తెలిసిందే.

ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ విచారణను ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా ఆయన జైలు జీవితాన్ని గడుపుతున్నారు. బెయిల్ కోసం వారు దాఖలు చేసుకున్న పిటిషన్లన్నిటినీ కూడా ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది.

రెబల్ ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు.. 19న తుది విచారణ..!

19వ తేదీన మధ్యాహ్నం జరిగే తుది విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. విచారణకు హాజరు కాకుంటే ఇప్పటి వరకు తాను విన్న వాదన ఆధారంగా పిటిషన్లపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు స్పీకర్.. దీంతో, తుది విచారణకు హాజరు కావాలా..? వద్దా..? అనే అంశంపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకునే పనిలో పడిపోయారట వైసీపీ రెబెల్స్..

పని ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలి

పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలపై వేధింపుల నిరోధక చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. మాటల ద్వారా గానీ, చేష్టల ద్వారా గానీ, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మహిళలపై వేధింపు చర్యలకు పాల్పడరాదని అలాంటి సంఘటనలు జరిగినప్పుడు జిల్లా అధికారులు చట్టంలో పేర్కొన్న నిబంధనలను, నియమావళిని పాటించాలని సూచించారు. జిల్లా జడ్జి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమైన పలువురు న్యాయ నిపుణులు పలు అంశాలపై వారి అభిప్రాయాలను, అనుభవాలను అవగాహన సదస్సులో పంచుకున్నారు.

సదస్సులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వివేక అనంద శ్రీనివాస్, క్రైం డీసీపీ పి. వెంకటరత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్. రాంబాబు, విశాఖపట్టణం జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై అభివృద్ధి జోరు

పర్యవేక్షణలో స్థానాచార్యులు టి.సి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజు, సువ్వాడ త్రిదేవి, ఏఇవోలు భ్రమరాంబ, పి.నరసింగరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈర్ ఓ దమ్ము అప్పలనాయుడు, వైదిక వర్గాలు పాల్గొన్నాయి.

విశాఖ సమాచారమ్

ఆదివారం 18-02-2024

హద్దులు దాటుతున్న పరస్పర ఆరోపణలు

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ నేతల మధ్య మాటల యుద్ధం తీవ్రతరమౌతోంది. పరస్పర ఆరోపణలతో పత్రికలు, సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విమర్శలు, ప్రతివిమర్శలు సంధిస్తున్నారు. గౌరవమైన ప్రజాప్రతినిధుల స్థాయిలో ఉండి వారు దిగజారి మాట్లాడుతున్న పదజాలం ప్రజలకు జుగుప్స కల్గిస్తోంది. దీనికి తోడు వ్యాపార సంస్థలుగా మారిన డిజిటల్ మీడియా బృందాలు ఇలాంటి వీడియోలను ప్రత్యక్ష ప్రసారంగా ఉధృతంగా ప్రజల మీద రుద్దుతున్నాయి.

ముఖ్యమంత్రి స్వయంగా హాజరైన శాసనసభలోను, బహిరంగ సభల్లోనూ కూడా ఆయన సహచర మంత్రులు ప్రతిపక్ష పార్టీల నేతలపై అసభ్యకరమైన వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతుంటే దానిని సిగ్గుగాను, అవమానకరంగాను భావించవలసిన గౌరవసీయులు వినోదంగా ఆనందిస్తున్నారు. ఇతరులను తిట్టడమే ప్రామాణిక అర్హతగా పార్టీలు తమ తమ అభ్యర్థులను ఇతరులపైకి ఉసిగొల్పడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటుగా పరిణమించింది.

భారత రాజ్యాంగ చట్టం చదువు, సంస్కారం వంటి ప్రమాణాలను అర్హతలుగా తీసుకోకుండా కేవలం వయస్సును మాత్రమే ప్రధాన అర్హతగా నిర్దేశించి ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని పౌరులకు కల్పించింది. ఈ అవకాశం ఎంత సరళంగా ఉంది అంటే నేరాలు చేసి జైలులో మగ్గుతున్న వారు, నేరారోపణలతో ఖైదీలయ్యి బెయిలు పై విడుదల అయినవారు కూడా యథేచ్ఛగా పోటీ చేసేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. స్వాతంత్ర్య సమరయోధులు, ఆ కాలం నాటి గౌరవనీయులు దాదాపుగా జీవితం చాలించినప్పటికీ భావితరాలలో మాత్రం బానిస భావాలు, ధనికుల పట్ల ఆరాధనా భావాలు, మూఢ భక్తి, అమాయకపు అనుసరణ విపరీతంగా పెరిగిపోయాయి. వీటి కారణంగా నేరాల ద్వారా ధనం సంపాదించడం, దానితో చట్ట భద్రతను రూపొందించుకోవడం, డబ్బుకోసం ఆశపడే వ్యక్తులను తాబేదారులుగా తీర్చిదిద్దుకుని, వారి ద్వారా మానవ మృగాలను తయారు చేసి రాజ్యాంగబద్ధమైన అధికారంలోకి వచ్చి తమ రాక్షస ప్రవృత్తి ద్వారా హింసాత్మక సంఘటనలకు పాల్పడడం, ప్రభుత్వ ఆస్తులను కైంకర్యం చెయ్యడం, వీరిని సామాన్యులు మొదలుకొని ఒక స్థాయి వ్యక్తులు వరకు అడ్డుకోగలిగే స్థితిలో లేకపోవడం రాజ్యాంగానికి ప్రమాదకరంగా పరిణమించింది.

కేవలం ధనం సంపాదించడం దానితో సుఖాలు కొనుక్కోవడం మాత్రమే జీవితం అనుకునే భ్రమ విద్యార్థి దశ నుండి భారతీయ యువతలో విశేషంగా పేరుకుపోయింది. వారికి ఉచ్చనీచాలతో సంబంధం లేకుండా ధనం సంపాదించడం, రహస్యంగా దాచి ఉంచడం, అర్హత లేని సుఖాలకు దానిని వెచ్చించడం, వ్యసనాలను పెంపొందించుకోవడం మానలేని అలవాటుగా మారింది. ఇలాంటివారిని ఆసరాగా చేసుకొని అనేకమంది దుష్టులు వీరికి అనుగుణంగా వ్యాపారాలను సృష్టిస్తూ తాము కూడా అపరిమితంగా సంపాదిస్తూ పెద్దమనుషులుగా చెలామణీ అయిపోతున్నారు. వీరు పెట్టుబడిదారులుగా మారి చట్టవిరుద్ధమైన జూదం, మద్యం, మాదకద్రవ్యాలు వంటి వ్యాపారాలలో స్థిరపడి రాజకీయ నాయకులను తమ ఏజెంట్లుగా పెంచి పెద్ద చేస్తూ వారికి వెనక ఉండి అన్ని రకముల వ్యవస్థలను కూడగడుతూ వారిని అధికారంలోకి రప్పించి తమ చేతిలో కీలుబొమ్మలుగా మార్చుకుని మరింత విధ్వంసానికి తెర తీస్తున్నారు. అసంబద్ధ ప్రేలాపనలకు, నిషిద్ధ పదప్రయోగాలకు వీరే ప్రధానమైన కారణమౌతున్నారు. దాదాపుగా అన్ని రకాల మీడియాలు ఇలాంటి వారి చెప్పుచేతల్లోనే కాలం వెళ్ళదీస్తున్నాయి.

మీడియా ప్రతినిధులు కూడా ఉసిగొల్పబడిన కుక్కల మాదిరిగా యాజమాన్యాల కోరికలకు అనుగుణంగా వార్తలను సృష్టిస్తూ నిషిద్ధ పదజాలాన్ని యథాతథంగా పత్రికలలో ప్రదర్శిస్తూ, ప్రత్యర్థుల దాడులకు బలి అవుతూ అడొక గొప్ప పాత్రికేయతగా భావిస్తూ పత్రికారంగ గౌరవాన్ని మంటగలుపుతున్నారు. ఇప్పుడు తాజాగా సెల్‌ఫోన్ ఉన్న అనేక మంది యువకులు యూట్యూబ్‌లో ఛానెల్స్ తయారు చేసుకుని పాత్రికేయులుగా అవతారం ఎత్తి అసలే పడుతూ లేస్తున్న పాత్రికేయ వ్యవస్థకు చీడపట్టినట్లుగా తయారయ్యారు. ఏదో ప్రళయం వచ్చి ఇలాంటి వ్యవస్థలు ప్రక్షాళనం అవ్వాలి తప్పించి మామూలు పద్ధతులలో మాత్రం ఇలాగే నడిస్తే దేశం పరువు అన్ని విధాలుగా బజారున పడక తప్పదు. సామాన్యులకు రక్షణ కరువై స్థానిక సంఘర్షణలు, ప్రత్యేక రక్షణ వ్యవస్థలు ఏర్పడవలసిన దుస్థితి గోచరిస్తోంది.

బిఎల్ఓలు నిబద్ధతతో పనిచేయాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఓటర్ల నమోదు ప్రక్రియలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బిఎల్ఓలు (బూత్ లెవెల్ ఆఫీసర్స్), సూపర్ వైజర్లను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా 2024(ఎస్.ఎస్.ఆర్) లో భాగంగా గత నెల 22న తుది జాబితా ప్రచురణ అయిందని తెలిపారు. ఆ జాబితా తదుపరి నమోదు అవుతున్న ఫారం - 6,7,8 లను బిఎల్ఓలు ఎప్పటి కప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు.

శనివారం ఉదయం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో బిఎల్ఓ ల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బిఎల్ఓలు, సూపర్ వైజర్లు పనిచేయాలని చెప్పారు. డెత్ కేసులు, డూప్లికేట్ ఓటర్లు వంటివి ఉన్నట్లయితే అటువంటి గృహాలను స్వయంగా సందర్శించి, ఖచ్చితమైన సమాచారంతో వాటిని పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ తేల్చిచెప్పారు. ఇందులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, ఒత్తిడిలకు గురికాకుండా పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ తప్పులు దొర్లితే సంబంధిత బిఎల్ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మీరు చేసే పనుల్లో మరలా తప్పులు జరగకుండా ఉండేందుకే ఈ శిక్షణ కార్యక్రమమని, కావున దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మోహన్ కుమార్, బిఎల్ఓలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఆందరిలో అవగాహన కలిగించడం మూలంగానే పటిష్టమైన రహదారి భద్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి చెప్పారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక రింగ్ రోడ్డు జంక్షన్ నుండి నెహ్రూచౌక్ వరకు పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీకి కలెక్టరు, ఎస్.పి. ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ, నిర్మాణం, సాధికారిత, అవగాహన (ఇంజనీరింగ్, ఎన్ పవర్ మెంట్, ఎడ్యుకేషన్) అనుసరించి నట్లయితే ఎటువంటి ప్రమాదాలు సంభవించవన్నారు. రోడ్లు, ట్రాఫిక్ లైట్లు, చిహ్నాలు మొదలైనవి పాడైనట్లయితే వెంటనే తగిన మరమ్మత్తులు చేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించడం, వాహనదారులు, చోదకులు, ప్రయాణికులు, బాటసారులకు ఎప్పటికప్పుడు కుణ్ణమైన అవగాహన కలిగించాలన్నారు. జిల్లా అవగాహనా సదస్సులు, తనిఖీలు విస్తృతంగా చేయడం మూలంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తున్న పోలీసు, రవాణా అధికారులు, సామాజిక కార్యకర్తలను ఆయన అభినందించారు.

పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రమాదాలకు అవకాశం వున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి డ్రైవర్లనుఅప్రమత్తుడం చేయడం, జరిమానాలు, అవగాహనా సదస్సులను నిర్వహించడం వలన ప్రమాదాల సంఖ్య, స్థాయి తగ్గిందని తెలిపారు. పాఠశాలలలు, కళాశాలలో విద్యార్థులకు, ఆటో, బస్సు, లారీ డ్రైవర్లకు అవగాహన కలిగించడం, గత అనుభవాలను పరిగణలోనికి తీసుకుని తగిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నిపుణులు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు రూపొందించడం, అధికారులు వాటిని అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా మద్యంపానం చేసి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం వల్లనే మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. కుడళ్లను దాటుతున్నప్పుడు పెద్దగా హారన్ మ్రోగించరాదన్నారు. బాటసారులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. జిల్లా కలెక్టరు జెండా వూపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డి.ఎస్.పి. సుబ్బరాజు, జిల్లా రవాణా అధికారి ప్రకాశరావు, డివియమ్ సి సభ్యుడు అప్పారావు, ఆటో డ్రైవర్లు, వాలంటీర్లు,పోలీసు, రవాణా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మరలా పరీక్ష పెట్టాల్సిందే : ఎస్ఎఫ్ఐ

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఏడవ తారీఖున డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంలో శుక్రవారం నాడు మ్యాథమెటికల్,ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ పరీక్షలు సంబంధించి మూడు గంటల నిర్వహించాల్సిందే పోయి గంటన్నర సమయం మాత్రమే పరీక్ష పెట్టి పేపర్ తీసుకోవడం జరిగిందని, యూనివర్సిటీ సమయం ప్రకారం మూడు గంటలు పరీక్షకు టైం ఇవ్వాలని అలా ఇవ్వకుండా ముందుగా పేపర్ తీసుకున్నందుకు శనివారం నాడు యలమంచిలి ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు బాలాజీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు.అక్కడ నుండి కాంప్లెక్స్ ఎదుట మానవహారం నిర్వహించి, అక్కడ నుండి ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో ఆర్.అప్పలరాజుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ మాట్లాడుతూ కళాశాల సిబ్బంది చేసిన పొరపాటు వలన విద్యార్థులు ఎందుకు నష్టపోవాలని విద్యార్థులకు పూర్తి సమయం ఇచ్చి మళ్లీ పరీక్ష నిర్వహించాలని వారికి న్యాయం చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు.ఈ ఘటనపై ఎమ్మార్వో స్పందిస్తూ ఎస్ ఎఫ్ ఐ ఇచ్చిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు పంపించి న్యాయం చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజి, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎస్ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్,తదితర బాధిత విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు,అధికారులు కృషి చేయాలి

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): యలమంచిలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం నాడు ఎంపీపీ బోడెపు గోవింద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూ ఎస్, వెలుగు ఉపాధిహామీ, వైద్య ఆరోగ్య శాఖ,ఆర్ అండ్ బి శాఖాధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించిన అనంతరం గ్రామ సర్పంచ్ లు,ఎంపిటిసిలు తమ గ్రామాలకి సంబంధించి వివిధ సమస్యలను సంభందిత శాఖాధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కరించాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారి మాట్లాడుతుండగా హాస్టల్ లో వాష్ రూమ్సు బాగోలేదని ఎంపీపీ తన దృష్టికి వచ్చిందన్నారు. అనంతరం ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. జెడ్పిటిసి సేనాపతి సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి సంభంధించిన వివిధ సమస్యలను సర్పంచ్ ల ద్వారా అధికారులు తెలుసుకున్నందున తక్షణమే వాటిని పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని వారికి సర్పంచ్ లు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాశీల్దార్ వీర భద్రాచారీ, ఎంపిడిఓ బి. అప్పలనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డపు యర్రయ్యదొర వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఎంపిటిసిలు, సర్పంచ్లు రాజానా మహాలక్ష్మి, సుంకర కొండబాబు,వివిధ విభాగాల గ్రామ,మండల స్థాయి అధికారులు, సూపర్ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పోసో యాక్ట్‌పై మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మహిళలు పోసో యాక్ట్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి శ్రీవిద్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్ లో మహిళలకు పోసో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది చట్టాలను ఉపయోగించుకోవడంలో నిర్లిప్తత గా వ్యవహరిస్తున్నారు అన్నారు. ప్రభుత్వాలు మహిళా రక్షణకై అనేక చట్టాలను ప్రవేశ పెట్టాయన్నారు. 200 మంది మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జ్ గంగరాజు,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రదీప, రెండో అదిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి , డీఈఓ లక్ష్మమ్మ ,ప్రెసిడెంట్ సాయి, ఎం ఎల్ ఎస్ సి ప్రతినిధి సత్యనారాయణ లక్ష్మణ్, సెక్రటరీ సూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం

రాంబిల్లి, (విశాఖ సమాచారమ్): మండలంలో కృష్ణంపాలెం గ్రామంలో శనివారం నాడు హెరిటేజ్ డైరీ మ్యానేజర్ కూంప్రపు శేషు ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీకి పాలు సరఫరా చేసే పాడి పశువులకు ప్రతీ గ్రామములో కృతిమ గర్భ ధారణ అందుబాటులో ఉంటుందన్నారు.అనంతరం హెరిటేజ్ డైరీ డాక్టర్ మనోజ్ చేతుల మీదుగా 50 పశువులకు డీ వార్మింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సి.హెచ్. రాము, ఆర్. సత్తిబాబు, ఆర్. చిన సత్యం, ఆర్.రాజేష్, అప్పారావు, పెంటయ్య, రమణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నాప్తాలిన్ ప్లాంట్ లో అగ్ని ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నాప్తాలిన్ ప్లాంట్ లో అగ్ని ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని స్టీల్ సిబటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామిలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు విశాఖ స్టీల్ ప్లాంట్ లోని కోక్ ఓవెన్ విభాగంలో నాప్తాలిన్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుందని వారు అన్నారు. దీనికి ప్రధాన కారణం అత్యంత ప్రమాదకరమైన అయిల్ ఉన్న ప్రదేశంలో వెల్డింగ్ పని చేస్తున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోవడం తోనే ఈ ప్రమాదం సంభవించిందని వారు అన్నారు. దీనిలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల విలువైన ఎలక్ట్రికల్ మోటార్స్, కేబుల్స్, విలువైన నాప్తా అగ్నికి ఆహుతి అయిందని వారు వివరించారు. ఈ సంఘటన తర్వాత దీనిలో ఉత్పత్తి పునః ప్రారంభించడానికి చాలా సమయం పడుతుందని వారు అన్నారు. కనుక యాజమాన్యం బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకొని ఇటువంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిబటియు కోక్ ఓవేన్ విభాగం ప్రతినిధులు మొహిద్దిన్, దేముడు నాయుడు అగ్ని ప్రమాద ప్రాంతాన్ని సందర్శించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): పిల్లల ఆరోగ్యం పట్ల తల్లి తండ్రులకు అవగాహన అవసరం అని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వైజాగ్ పారహోంట్ అధ్యక్షులు బి.చైతన్య రాజేష్ అన్నారు. శనివారం యండాడ సంస్కృతి స్కూల్ విద్యార్థులకు జెసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. జెసిఐ సంజీవని కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు అధ్యక్షులు చైతన్య రాజేష్ తెలిపారు. పిల్లల వైద్య నిపుణులు డా. గోపిచంద్, వి డెంటల్ హాస్పిటల్ డా. ముస్త్రెత్ సుమారు 100 మంది విద్యార్థులకు సాదారణ ఆరోగ్య, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంతాల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి బెస్ట్ స్టైల్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం లో సంస్కృతి స్కూల్ ప్రిన్సిపాల్ వల్లీ రాంగోపాల్, వి డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్,

జెసిఐ కోచ్ వి.రాధాకృష్ణ, డైరెక్టర్ జి.సుహాసిని, పి.సందీప్, బి.గిరిజా తదితరులు పాల్గొన్నారు.

చేపలు తిన్న తర్వాత పాలు తాగితే చర్మ వ్యాధులు వస్తాయా?

చేపలను చాలా మంది ఇష్టంగా లాగిచేస్తుంటారు. రకరకాల చేపలు ఫ్రై, చేపల పులుసు, ఫిష్ బిర్యాని ఇష్టంగా తినేవారు చాలా మందే ఉంటారు. వారందరికీ ఎప్పుడో ఒకప్పుడు పెద్ద వాళ్ల నుంచి ఒక సూచన లేదా హెచ్చరిక వచ్చే ఉంటుంది. అదేంటంటే.. ఫిష్ తిన్న తర్వాత పాలు తాగవద్దని, పెరుగు తినవద్దని చెప్పడం చాలా మందికి తెలిసిందే.

చేపల కూర తిన్న తర్వాత పాలు తాగితే ఆరోగ్య సమస్యలు వస్తాయని చాలా మంది పెద్దలు చెబుతుంటారు. బొల్లి వస్తుందని హెచ్చరిస్తుంటారు. నిజంగానే చేపలు తిన్న తర్వాత రెండూ హైప్రొటీన్ ఫుడ్స్ అందుకే ఆ సమస్య: చేపలు తిన్న తర్వాత పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులు ఏవీ తీసుకోవద్దని అంటారు పెద్దలు. అలా తింటే చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని అంటారు. చర్మం అంతటా తెల్ల మచ్చలు ఏర్పడతాయని, బొల్లి వస్తుందని అందుకే చేపలు తిన్న తర్వాత పాలు తాగొద్దని అంటారు. కాగా, చేపలు, పాలు రెండూ హై ప్రొటీన్ ఫుడ్స్.

అధిక పోషకాలు ఉన్న ఆహారాలు జీర్ణం కావడానికి సాధారణంగానే ఎక్కువ సమయం పడుతుంది. అలాగే వీటిని జీర్ణించుకోవడానికి శరీరం శక్తిని వెచ్చించాల్సి వస్తుంది. దాంతో పాటు వివిధ రకాల ఎంజైమ్‌లు అవసరం కూడా. ఈ రెండు రకాల హై ప్రొటీన్ ఫుడ్స్ ను ఒకేసారి తీసుకుంటే వాటిని జీర్ణించే ప్రక్రియలో గ్యాస్ ఎక్కువ మొత్తంలో విడుదల అవుతుంది. దాని వల్ల కడుపు ఉబ్బరంగా ఉంటుంది. మరికొంత మందిలో జీర్ణ సమస్యలు కూడా రావొచ్చు.

రెండింటిని కలిపి తీసుకుంటే సమస్యేం లేదు: చేపలు తిన్న తర్వాత పాల తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని ఎక్కడా నిరూపితం కాలేదని, దానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. చేపలు తిన్న తర్వాత పాలు తాగితే చర్మ సంబంధిత సమస్యలు, బొల్లి వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమేనని పేర్కొంటున్నారు. చేపలు, పాలు, పెరుగు కలిస్తే విషంగా మారుతుందన్న దాంట్లోనూ ఎలాంటి వాస్తవం లేదని అంటున్నారు వైద్యులు. చాలా ప్రాంతాల్లో చేపలను నిత్యం తింటుంటారు. ఆ తర్వాత పాలు, పెరుగు లాంటివి కూడా తీసుకుంటారు.

చేపలు, పాలు కలిపి తినడం వల్ల బొల్లి రాదు: బొల్లి అనేది ఒకరకమైన చర్మ వ్యాధి. చర్మంపై పాచెస్ మాదిరిగా రంగు మారుతుంది. చర్మం వ్యాప్తంగా తెల్లని మచ్చలు ఏర్పడతాయి. ఇది కాలక్రమేణా పెద్దదిగా మారుతుంది. శరీరంలోని ఏ భాగంలోనైనా బొల్లి ఏర్పడవచ్చు. ఎక్కడ ఏర్పడినప్పటికీ క్రమంగా శరీరం మొత్తం వ్యాపిస్తుంది. మెలనిన్ సాధారణంగా జుట్టు, చర్మం రంగును నిర్ణయించే పదార్థం. బొల్లి వచ్చిన వారిలో మెలనిన్ ఉత్పత్తి చేసే కణాలు చనిపోతాయి లేదా పని చేయడం మానేస్తాయి. బొల్లి అన్ని చర్మ రకాల వ్యక్తులను ప్రభావితం చేస్తుంది.

బొల్లి ప్రాణాపాయమైన వ్యాధి కాదు. అలాగే బొల్లి అంటువ్యాధి కూడా కాదు. అయితే బొల్లి వచ్చిన వారిలో ఒకరకమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుంది. దీని వల్ల ఒత్తిడి కలుగుతుంది. ఇది ఇతర ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది.

శరీరంలో విషాన్ని వదిలించుకోవాలనుకుంటున్నారా?

ప్రస్తుత చెడు ఆహారపు అలవాట్లు, అనారోగ్యకరమైన జీవనశైలి మరియు కొన్ని చెడు అలవాట్లు శరీరంలోని విషానికి హానికరం. శరీరంలో టాక్సిన్స్ పెరిగినప్పుడు, ఇది శరీరంలో అనేక వ్యాధులకు కారణమవుతుంది. అందుకే చాలా మంది ప్రజలు ఈ రోజు అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.కాబట్టి మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, మీరు మొదట శరీరంలోని విషాన్ని వదిలించుకోవడానికి ప్రయత్నించాలి. శరీరంలో విషాన్ని విడుదల చేయడానికి చాలా పానీయాలు సహాయపడతాయి. మీరు ప్రతిరోజూ ఆ పానీయాలు తాగితే, మీరు శరీరంలోని విషాన్ని నివారించవచ్చు.

కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా ఆరోగ్యకరమైనదిగా పరిగణించబడుతుంది. నిత్యం కొబ్బరినీళ్లు తాగేవారు మనలో చాలా మంది ఉన్నారు. రోజూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల మీ శరీరానికి ప్రాణిన్లు మరియు విటమిన్లు పుష్కలంగా అందుతాయి. దీనితో మీరు మీ పెరుగుతున్న బరువును తగ్గించుకోవచ్చు. అలాగే, ఇందులో చక్కెర పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో కేలరీలు కూడా సున్నాకి సమానం. ఈ సందర్భంలో, ఇది మీ బరువును చాలా వేగంగా తగ్గిస్తుంది. మీరు తక్కువ కొవ్వు మరియు తక్కువ చక్కెర పానీయం తీసుకోవాలనుకుంటే, కొబ్బరి నీళ్ల కంటే మెరుగైన ఎంపిక మరొకటి ఉండదు.

అయితే మీరు ఎప్పుడైనా కొబ్బరి నీళ్లలో నిమ్మరసం కలిపి తాగారా? కాకపోతే, ఖచ్చితంగా ఒకసారి ప్రయత్నించండి. కొబ్బరి నీరు మరియు నిమ్మరసం జీర్ణక్రియ, రక్తంలో చక్కెరను నియంత్రించడం, అల్జీమర్స్ మరియు అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు వంటి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటాయి. కొబ్బరి నీళ్ళు మరియు నిమ్మకాయ వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం?

కొబ్బరి నీరు మరియు నిమ్మకాయ యొక్క ప్రయోజనాలు -

నిమ్మకాయలో విటమిన్ సి సహా యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీన్ని తీసుకోవడం ద్వారా, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుండి శరీరం రక్షించబడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో మీకు సహాయపడుతుంది. మరోవైపు, కొబ్బరి నీరు ఒక రుచికరమైన మరియు ఎలక్ట్రోలైట్ అధికంగా ఉండే సహజ పానీయం, ఇది మీ హృదయానికి ఎంతో మేలు చేస్తుంది. దీన్ని రెగ్యులర్ గా ఉపయోగించడం ద్వారా బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. ఇది కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే గుండె ఆరోగ్యానికి కూడా మంచిది.

కొబ్బరినీళ్లు, నిమ్మరసం కలిపి తీసుకుంటే బరువు త్వరగా తగ్గుతారు. బ్లడ్ షుగర్ అదుపులో ఉండాలంటే కొబ్బరినీళ్లు, నిమ్మరసం కలిపి రోజూ తాగాలి. అధిక రక్తపోటు ఉన్న రోగులకు కొబ్బరి నీరు మరియు నిమ్మకాయ మిశ్రమం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీరు మరియు నిమ్మరసం మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలో చాలా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. నిమ్మరసం, కొబ్బరినీళ్లు కలిపి తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇది మూత్ర సంబంధిత సమస్యలను అధిగమించడంలో మీకు సహాయపడుతుంది. కొబ్బరినీళ్లు, నిమ్మరసం కలిపి తాగడం వల్ల జీర్ణశక్తి బలపడుతుంది.

కొబ్బరి నీరు మరియు నిమ్మరసం ఎలా తీసుకోవాలి?

2 టేబుల్ స్పూన్లు తాజా నిమ్మరసం 1 కప్పు కొబ్బరి నీరు స్పూన్ తురిమిన అల్లం రుచికి ఉప్పు 1 టీస్పూన్ తేనె

దీన్ని ఎలా సిద్ధం చేయాలి?

ముందుగా నిమ్మరసం తీసుకోవాలి.

దీని తరువాత, బ్లెండర్లో కొబ్బరి నీరు, తేనె, అల్లం మరియు ఉప్పు వేయండి. అన్నిటినీ బాగా కలపండి. ఇప్పుడు గ్లాసులో పోసి సర్వ్ చేయాలి. మీరు దీన్ని నిల్వ చేయడం ద్వారా కూడా చేయవచ్చు. దీన్ని వారానికి రెండు సార్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. నిమ్మరసం మరియు కొబ్బరి నీళ్ళు కలిపి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే, మీకు ఏవైనా శారీరక సమస్యలు ఉన్నట్లయితే లేదా ఈ పదార్థాలకు అలెర్జీ ఉంటే, నిపుణులను సంప్రదించిన తర్వాత మాత్రమే ఈ పానీయాన్ని తినండి.

చర్మానికి విటమిన్ ఇ తో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు

మన చర్మానికి పోషణ, రక్షణ విషయానికి వస్తే విటమిన్ ఇ మొదటి స్థానంలో ఉంటుంది.ఈ ముఖ్యమైన విటమిన్ మొత్తం చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడే యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో నిండి ఉంది.

విటమిన్ ఇ ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, ఇది కాలుష్యం, UV కిరణాలు, పర్యావరణ టాక్సిన్స్ వల్ల కలిగే హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి చర్మాన్ని రక్షిస్తుంది.

ఈ ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడం ద్వారా ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షించడంలో విటమిన్ ఇ సహాయపడుతుంది. ఇది మీకు మెరిసే ముఖాన్ని ఇవ్వగలదు.

విటమిన్ ఇ లో తేమ గుణాలు ఉన్నాయి, ఇది చర్మం హైడ్రేషన్, తేమ నిలుపుదలలో సహాయపడుతుంది. ఇది డ్రై స్కిన్ సమస్యను దూరం చేస్తుంది.

విటమిన్ ఇ చర్మాన్ని నయం చేయడంలో సహాయపడుతుంది. ఇది గాయాలను వేగంగా నయం చేయడంలో సహాయపడుతుంది.

ఇది మంటను తగ్గిస్తుంది మరియు మచ్చల రూపాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన కణాలను పునరుత్పత్తి చేయడంలో సహాయపడుతుంది.ఇది చర్మాన్ని మృదువుగా మరియు మృదువుగా చేస్తుంది.

విటమిన్ బి12 లోపం ఉంటే జుట్టు ఊడిపోతుంది

జుట్టు విపరీతంగా రాలడం మొదలుపెట్టినప్పుడు జుట్టు ఎందుకు రాలిపోతుందో చాలామందికి తెలియదు.నీళ్లలో ఏమైనా మార్పు వచ్చిందా? పోషక లోపాలు ఉన్నాయా? ఆరోగ్య సమస్యల వల్లనా? హార్మోన్లలో మార్పు? జుట్టు రాలడానికి ఖచ్చితమైన కారణం తెలియదు.

జుట్టు రాలడానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకుంటే జుట్టు రాలడాన్ని నివారించడం సులువవుతుంది. విటమిన్ లోపం వల్ల జుట్టు రాలిపోతుందని చాలా మంది అనుమానిస్తున్నారు. మీ జుట్టులో ఈ లక్షణాలు కనిపిస్తే జుట్టు రాలడానికి విటమిన్ సమస్యే కారణమని చెప్పవచ్చు. మీ జుట్టులో మార్పులు విటమిన్ బి12 లోపాన్ని సూచిస్తే, మీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు:

విటమిన్ బి12: విటమిన్ బి12 నరాలు మరియు రక్త కణాల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది. బి12 లోపం రక్తహీనతకు కారణమవుతుంది. మనం తినే ఆహారం ద్వారా విటమిన్ బి12 లభిస్తుంది. దీని లోపం వల్ల రక్తహీనత వస్తుంది. రక్తహీనత అనేది తీవ్రమైన సమస్య, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం.

విటమిన్ బి12 లోపం : మన శరీరానికి విటమిన్ బి12 అందనప్పుడు విటమిన్ బి12 లోపం ఏర్పడుతుంది. ఇది శరీర పనితీరుపై చెడు ప్రభావం చూపుతుంది. విటమిన్ బి12 లోపాన్ని మన స్వంతంగా నిర్ధారించడం కష్టం, మీరు నిపుణుల వద్దకు వెళ్లినప్పుడు వారు దానిని నిర్ధారిస్తారు. అయితే ఈ సమస్య వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లాం, మొదట్లో ఈ విషయం తెలియదు. కానీ విటమిన్ బి12 ఉన్నప్పుడు జుట్టులో కొంత మార్పు వస్తుంది.

జుట్టులో విటమిన్ బి12 లోపం యొక్క లక్షణాలు : మన జుట్టు మూలాలకు ఆక్సిజన్ సరఫరా చేయడానికి రక్త కణాలకు విటమిన్ బి 12 అవసరం. విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు, జుట్టు కుదుళ్లు వదులుగా మారతాయి, జుట్టు రాలడం ప్రారంభమవుతుంది మరియు జుట్టు చాలా పల్చగా మారుతుంది. అందుకే జుట్టు బాగా పల్చగా ఉంటే శరీరంలో విటమిన్ బి12 లోపానికి చెక్ పెట్టడం మంచిది.

అకాల తెల్లజుట్టు : శరీరంలో విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు అకాల బూడిద జుట్టు ఏర్పడుతుంది. జుట్టు తెల్లబడటమే కాదు, అయాసం, తల తిరగడం, తలనొప్పి, మైగ్రేన్, గోళ్లలో పగుళ్లు కూడా వస్తాయి. ఇవేకాకుండా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్వరంలో మార్పు, చేతి నొప్పి ఇలా అన్నీ లక్షణాలు.

మెదడుపై విటమిన్ బి12 లోపం యొక్క ప్రభావాలు: విటమిన్ బి12 లోపం మెదడుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది గందరగోళం, మతిమరుపు, డిప్రెషన్, మూడ్ స్వింగ్స్, యాంగ్జియిటీ, పర్సనాలిటీ డిజార్డర్ వంటి అనేక సమస్యలకు దారి తీస్తుంది. విటమిన్ బి12 లోపం వల్ల అల్జీమర్స్ వంటి సమస్యలు కూడా రావచ్చు. కాబట్టి విటమిన్ బి12 లోపాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

విటమిన్ బి12 కలిగి ఉన్న ఆహారాలు: విటమిన్ బి12 జంతువుల కాలేయం మరియు మూత్రపిండాలలో ఉంటుంది , ట్యూనా, సాల్మన్ చేపల్లో విటమిన్ 12 ఉంటుంది. గుడ్డులో విటమిన్ బి12 ఉంటుంది. చీజ్ మరియు గుడ్లలో కూడా విటమిన్ బి12 ఉంటుంది. విటమిన్ బి12 కొన్ని ధాన్యాలలో ఉంటుంది, కానీ మాంసంలో ఎక్కువగా ఉంటుంది. విటమిన్ బి12 లోపం ఉన్నట్లయితే ఒక వైద్యుడు సప్లిమెంట్లను సూచించవచ్చు.

ఇంట్లో అందరూ ఒకే సబ్బు వాడటం ఎంతవరకు సురక్షితం?

ప్రస్తుతం మార్కెట్‌లో సబ్బుకు బదులుగా చాలా బాడీ వాష్ లిక్విడ్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్ని ఇళ్లలో ముఖ్యంగా గ్రామాల్లో ఇంటి సభ్యులందరికీ ఒకే సబ్బును ఉపయోగించడం అలవాటు. అయితే ఇంట్లో అందరూ ఒకే సబ్బు వాడటం ఎంతవరకు సురక్షితం ? దీనిపై నిపుణులు చేసిన పరిశోధనల ఫలితాలు ఏమిటి?

ఇండియన్ జర్నల్ ఆఫ్ డెంటల్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన 2006 అధ్యయనంలో స్నానానికి ఉపయోగించే సబ్బులో రెండు నుంచి ఐదు రకాల సూక్ష్మజీవులు ఉన్నాయని కనుగొన్నారు. అదనంగా అమెరికన్ జర్నల్ ఆఫ్ ఇన్ఫెక్షన్ కంట్రోల్‌లో 2015 అధ్యయనంలో దాదాపు 62 శాతం బార్ సబ్బులు కలుషితమై ఉన్నాయని కనుగొన్నారు. సబ్బుపై ఉండే బాక్టీరియా ఒకే సబ్బును ఉపయోగించి వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి చెందుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. సబ్బులో సాల్మొనెల్లా, షిగెల్లా బాక్టీరియా వంటి జెర్మ్స్, అలాగే నోరోవైరస్, రోటవైరస్, స్టాఫి వంటి వైరస్లు ఉంటాయి. కొన్ని చర్మంపై కోతలు లేదా గీతల ద్వారా వ్యాప్తి చెందుతాయి. మరికొన్ని మలం ద్వారా వ్యాపిస్తాయి. అందుకే ఒకే ఒక్క సబ్బును ఉపయోగించడం సురక్షితం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మైగ్రేన్ సమస్య ఆయుర్వేదంతో దూరం

రోజుల తరబడి తలనొప్పి తగ్గకపోతే కచ్చితంగా అది మైగ్రేన్‌కు సంకేతంగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ తలనొప్పి బ్లైండ్ స్పాట్స్, వికారం, వాంతులు, కాంతి వెలుగులు, ధ్వని ఇరిటేషన్ వంటి సమస్యలు ఉంటే ఆ తలనొప్పిని కచ్చితంగా మైగ్రేన్ కింద గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. మీరు మేగ్రేన్‌తో బాధపడుతుంటే మీ నుదుటిపైన అసౌకర్యంగా ఉంటుంది.

మారుతున్న ఆహార అలవాట్లు జీవనశైలి కారణంగా వివిధ ఆరోగ్య సమస్యలు అందరినీ వేధిస్తున్నాయి. ముఖ్యంగా వయస్సుతో సంబంధం లేకుండా వివిధ సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి. ఈ మధ్య కాలంలో తలనొప్పి సమస్య అందరినీ వేధిస్తుంది. అయితే కొందరిలో ఈ నొప్పి రోజుల వ్యవధిలోనే తగ్గిపోగా మరికొందరిని చాలా రోజులు వేధిస్తుంది. అయితే రోజుల తరబడి తలనొప్పి తగ్గకపోతే కచ్చితంగా అది మైగ్రేన్‌కు సంకేతంగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ తలనొప్పి బ్లైండ్ స్పాట్స్, వికారం, వాంతులు, కాంతి వెలుగులు, ధ్వని ఇరిటేషన్ వంటి సమస్యలు ఉంటే ఆ తలనొప్పిని కచ్చితంగా మైగ్రేన్ కింద గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. మీరు మేగ్రేన్‌తో బాధపడుతుంటే మీ నుదుటిపైన అసౌకర్యంగా ఉంటుంది. అయితే మైగ్రేన్ నుంచి రక్షణకు ఆయుర్వేద వైద్య ప్రభావవంతంగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆయుర్వేదంలోని కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు.

శిరోలేప: శిరోలేప అనే ప్రక్రియ మైగ్రేన్లు, ఒత్తిడి కారణంగా ఏర్పడే మానసిక అలసటను నయం చేస్తుంది. ఇది ఓ ఆయుర్వేద టెక్నిక్. కొన్ని రకాల మూలికలను కలిపి పేస్ట్‌లా చేస్తారు. అనంతరం ఈ పేస్ట్‌ను తలపై పూస్తారు. ఓ గంటపాటు అంటాకు సాయంతో తలపై ఈ పేస్ట్‌ను పెట్టుకోవడం వల్ల మైగ్రేన్ సమస్య దూరం అవుతుంది.

శిరోధార : చెవ్వని నూనె సన్నని ప్రవాహం కింద నుదిటిపై పారిస్తారు. సాధారణంగా మన నరాలన్నీ మెదడుతో కనెక్ట్ అయ్యి ఉంటాయి. ఇలా నూనెను తలపై పారుతుండడం వల్ల నూనె పీడనం నుదిటిపై కంపనాన్ని సృష్టిస్తుంది. ఇది మనస్సు, నాడీ వ్యవస్థను మానసిక విశ్రాంతికి లోను చేస్తుంది. తద్వారా మైగ్రేన్ సమస్య పరిష్కారమవుతుంది.

కవల గ్రహ : కవల గ్రహ నిర్వహణకు ప్రభావాన్ని కలిగి ఉంటుంది. తద్వారా మైగ్రేన్ సమస్యను దూరం చేస్తుంది. ఆయుర్వేదం మైగ్రేన్ అటాక్‌లను నయం చేయడానికి చందనాది తైలా ఆనాన్ మహానారాయణ తైలంతో ఆయిల్ పుల్లింగ్ చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

స్నేహనాశయ : ఈ చికిత్స నాసికా మార్గం ద్వారా చేస్తారు. పిచ్చిందు తైలా లేదా అనుతైలా వంటి వైద్య నూనెలను మీ నాసికా చుక్కల్లో వేసిన విధంగానే నాసికా రంధ్రాల్లో ఉంచుతారు. ఇది భుజం ప్రాంతంపై నొప్పి చికిత్సలో ఉపయోగపడుతుంది.

నిద్రపోయేటప్పుడు చెవుల్లో బడ్స్ పెట్టుకునే అలవాటుందా, ఏమౌతుంది



ఇటీవలి కాలంలో చాలామంది నిద్రించేటప్పుడు మొబైల్ ఫోన్ విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. ఇయర్ ఫోన్స్ లేదా బ్లూటూత్ బడ్స్ చెవిలో పెట్టుకుని ఫోన్ చూస్తూ నిద్రపోతుంటారు. ఈ అలవాట ఆరోగ్యంపై కచ్చితంగా దుష్ప్రభావం చూపిస్తుంటుంది.

రోజువారీ జీవితంలో అలవర్చుకునే వివిధ రకాల అలవాట్లు ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంటాయి. ఇందులో ఒకటి రాత్రి వేళ నిద్రపోయేటప్పుడు చెవిలో ఇయర్ బడ్స్ పెట్టుకుని మొబైల్ చూస్తూ ఉండిపోవడం. అప్పుడప్పుడూ ఇలా చేస్తే ఫరవాలేదు కానీ రోజూ ఇదే పనిగా అలవాటు చేసుకుంటే మాత్రం దుష్ప్రభావం పడుతుంది. అనారోగ్య సమస్యలకు కారణమౌతుంది. రాత్రంతా చెవుల్లో ఇయర్ బడ్స్ పెట్టుకుని ఫోన్ చూస్తూ నిద్రపోవడం లేదా రాత్రంతా అలా వింటూ ఉంటుంటే చెవుల సామర్థ్యం తగ్గిపోతుంది. చెవి నొప్పి సమస్య వెంటాడుతుంది. అందుకే ఇలాంటి అలవాటు ఉంటే దూరం చేసుకోవాలి

ఇటీవలి కాలంలో గ్యాడ్జెట్స్ వినియోగం అధికమౌతోంది. ఇది మీ ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందని చాలామందికి తెలియదు. ఒకవేళ తెలిసినా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారు. కొంతమంది ఇంట్లోంచి బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లో బడ్స్ పెట్టుకుని పాటలు వింటుంటారు. ఇది మీ స్ట్రెస్ లెవల్సు పెంచుతుంది. అదే పనిగా చెవుల్లో పెట్టుకుని తిరుగుతుంటే చెవుల్లో బీప్ సౌండ్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్యకు పరిష్కారం ఏదీ లేదు.

చెవుల్లో వ్యాక్స్ ఏర్పడటం ఓ ప్రాకృతిక సమస్య. ఒకవేళ ఎవరైనా 24 గంటలూ అదే పనిగా చెవుల్లో ఇయర్ బడ్స్ వాడుతుంటే చెవుల్లో ఏర్పడే వ్యాక్స్ లోపలకు పోతుంది. ఇది చాలా ప్రమాదకరం. అంతేకాకుండా చెవుల్లో దురద, నొప్పి మొదలౌతాయి.

ఘనంగా శ్రీ గౌరి పరమేశ్వరుల ఊంజల సేవ

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక గవరపాలెం శ్రీ గౌరి పంచాయతన దేవస్థానంలో శ్రీ గౌరి పరమేశ్వరుల 189వ ఊంజల సేవ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం దేవాలయ అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ , పొందూరు సూర్య నారాయణ శాస్త్రి,శేషు, సాయి , వేదవిదులైన పండితులచే నిర్వహించబడింది. ఈ ఊంజల్ సేవలో పాల్గొన్న మల్ల అప్పారావు రవిరాజ్ అరుణ దంపతులు, కుటుంబ సభ్యులు, అతిథులు శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరి పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ రావు జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించేందుకు ఈ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.

శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం నందు హాజరు అయి, వారి యొక్క అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను విన్నవించుకోగా, అదనపు ఎస్పీ వారి విన్నపములను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ బి డి.ఎస్.పి అప్పారావు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): సాధారణ బదిలీల లో భాగంగా బి.అప్పారావు రాజమండ్రి, ఎస్.బి డిఎస్పిగా పనిచేస్తూ బదిలీపై అనకాపల్లి జిల్లా, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణనీ జిల్లా పోలీస్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

రైతుల త్యాగాలకు అద్దం పెట్టిన రాజధాని ఫైల్స్ సినిమా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాజధానీ ఫైల్స్ సినిమా రాజధానీ రైతుల త్యాగాలు, పోరాటాలకు నిలువుటద్దంగా ఉందనీ మాజీ శాసనసభ్యుడు పీ లా సత్యనారాయణ అన్నారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ లో ప్రదర్శించిన రాజధాని ఫైల్స్ సినిమాని తిలకించిన అనంతరం సినిమా పట్ల ఆయన స్పందించారు.సినిమా దర్శక నిర్మాతలు అమరావతిలో జరిగిన వాస్తవాలను కళ్ళకు కట్టినట్టు చూపించారన్నారు.ప్రజలందరు కూడా రాజధానీ ఫైల్స్ సినిమా చూసి అమరావతిలో జగన్ చేసిన విధ్వంసాన్ని, వాస్తవాలను తెలుసుకోవాలి.మూడు రాజధానుల పేరుతో జగన్ మోహన్ రెడ్డి విశాఖ ప్రజలనూ మోసం చేశారని విమర్శించారు.

నాలుగేళ్లుగా విశాఖలో జరిగిన అభివృద్ధి పై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.

రాజధానీ రైతుల త్యాగాలను, పోరాటాలను నిలువుటద్దంగా నిలిచిన రాజధానీ ఫైల్స్ సినిమాకు అనుమతి ఇచ్చినందుకు హై కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. జగన్ రెడ్డి తన పాలనలో జరిగిన విధ్వంసాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తున్నారు అన్నారు.మూడు రాజధానుల పేరుతో నాలుగేళ్లుగా ఒక్క అభివృద్ధి కూడా చేయకుండా జగన్ రెడ్డి విశాఖ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మల్ల సురేంద్ర, కర్రి వెంకట సన్యాసినాయుడు , పోలారపు త్రినాథ, పిట్ల రాజు, దాడి జగన్, సూరే సతీష్ , కొణతాల ఉమా, గైపురి రాజు వేగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో దక్షిణంలో విశ్వబ్రాహ్మణ కులస్తులకే ప్రధాన పార్టీలు సీట్లు కేటాయించాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న విశ్వబ్రాహ్మణ కులానికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మహాసేన (బీసీ)డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నగరంలో డాబాగార్డెన్స్ వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇంతవరకు విశ్వబ్రాహ్మణులకు ఏ పార్టీ వారు సరియైన గుర్తింపు ఇవ్వలేదు. రాబోయే ఎలక్షన్ లో విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలు ఇవ్వవలసిందిగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రధాన పార్టీలను కోరుచున్నారు. రాబోయే ఎలక్షన్లో విశ్వబ్రాహ్మణ లో ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల మంది ఉన్నారు. వీరికి ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ నాయకులు గుర్తింపు లేదు. ఈసారి ఎలక్షన్లో విశ్వబ్రాహ్మణులను సరియైన గుర్తింపుఇస్తారని ప్రధాన పార్టీలను డిమాండ్ చేయుచున్నారు. ఎలక్షన్స్ వచ్చే టైంకి అన్ని పార్టీ వాళ్లు మీకు తప్పనిసరిగా ఎమ్మెల్యే గాని, ఎమ్మెల్సీ గాని వాగ్దానం చేయడం జరిగింది. ఏ పార్టీ వాళ్ళు కూడా వారి మాటలను నిలబెట్టుకోలేదు. ప్రధాన పార్టీ తరపున ఎమ్మెల్యే గా పోటీ చేయాలని తమ సంఘం ఇద్దరు కార్పొరేటర్

కాళి సన్యాసి రాజు, కే.సూర్య, ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ, విశ్వ బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వాలి అని కోరారు.

జిల్లా అధ్యక్షుడు శివ కోటి వాసు మాట్లాడుతూ, 25 వేలు గాజువాక లో పడి వేలు జిల్లాలో లక్ష మంది జనాభా వుంది.

గోడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విశ్వ బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వాలి గత టీడీపీ టికెట్ ఇవ్వకుండా మాట తప్పరూ విశాఖ దక్షిణ లో అధిక సంఖ్యలో పది వేలకు పైగావిశ్వ బ్రాహ్మణులకు ఓటర్లు వున్నారు విశాఖ దక్షిణ టికెట్ ఇవ్వాలి ఎమ్మెల్సీ స్థానం అయినా ఇవ్వాలి.

తమ సామాజక వర్గంలో ఐదు రకాల వృత్తుల వారు వున్నారు. రాజకీయ పరంగా ప్రాధాన్యత ఇవ్వాలి.

తాళ్లాబత్తుల అప్పలాచారి, విశ్వబ్రాహ్మణ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లాబత్తుల శ్రీనివాస్, టీడీపీ నాయకుడు గోడి నర్సింహారావు, మాజీ కార్పొరేటర్ బోదులపాటి ఉమామహేశ్వర్ రావు , కే.సన్యాసి రాజు, జి.రవి, ఏ.శ్రీనివాస్, ఎం.ప్రసాద్, సూర్య సాయి, కే.మహేష్, ఎం.నాగేశ్వర రావు, పి.ప్రసాద్, బీ.సూర్యనారాయణ, పి. కొండ బాబు, బీ.సురేష్, పాల్గొని మాట్లాడారు.

జీరో మని పాలిటిక్స్ ధ్యేయం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): డాబా గార్డెన్స్ వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఆల్ తెలుగు ప్రజా పర్టీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకురాలు సంధ్య శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

అల్ తెలుగు ప్రజా పార్టీ (ఏ టి పీ పి) విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకురాలు నందికోళ్ళ సంధ్య మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో విశాఖ అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. రాష్ట్రంలో రాజకీయాల్లో కులం, వారసత్వ ప్రాముఖ్యత ఎక్కువగా ఉంది.

సామాన్య ప్రజల సంక్షేమం కోసం మేధావి వర్గం సహకారంతో ముందుకు వెళతామని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పని తీరు బాగా లేదు. ఓటు హక్కు విలువ వివరిస్తాను. ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ప్రకారం టిక్కెట్లు ఇస్తాము. విద్య వైద్యం అందిస్తాము.

రాష్ట్రంలో 174 స్థానాలకు పోటీ చేస్తాము, ఒక్క నెల్లూరులో జే ఎస్ ఎస్ పార్టి పోటీ చేస్తుంది. తమ పార్టి ఇప్పటికే 26 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామన్నారు. జీరో మని పాలిటిక్స్ కోసం కృషి చేస్తాము. అవినీతి రహిత పాలన అందిస్తాము. సీతమ్మ పేట లో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసాము అని గుర్తు చేశారు.

గంటి మోహన రావు మాట్లాడుతూ, బౌద్ధం ప్రజలు ఎలా సంతోషంగా వుండాలి అని బోధిస్తుంది. రాష్ట్రంలో బౌద్ధ మతంకి ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలి అని కోరారు. పార్టీ నేత సాయేశ్వర రావు, మాట్లాడుతూ, బీసీ ముఖ్య మంత్రి రావాలి అన్న పార్టి ఆశయం నచ్చి పార్టీలో చేరాను అన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలతో సిద్ధం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ తో కలసి పాల్గొన్నారు. జిల్లాలో జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. జిల్లాలో గల పోలింగ్ కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధం చేయడం జరిగిందని, నిర్వహణకు అవసరమైన అధికారులు సిబ్బందిని సమయత్తం చేయడం జరిగిందని చెప్పారు. రూటు మ్యాపులను సిద్ధం చేసినట్లు, అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సమస్యాత్మక అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని వాటి దగ్గర అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికలలో జరిగిన సంఘటనలు పరిశీలించి తదనుగుణంగా ప్రజాభీకాయుక్తంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మద్యం ఇతర మాదక ద్రవ్యాల రవాణాను ముందుగానే గుర్తించేందుకు అవసరమైనచోట్ల చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా తగిన కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు సిబ్బంది పోలీసు సిబ్బంది వాహనాలు గస్తీ సిబ్బంది మొదలైన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈవీఎంలపై ఓటింగ్ ఏ విధంగా చేయాలనే శిక్షణా కార్యక్రమాలు కూడా విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. వివాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించడం జరిగిందన్నారు. పోలీస్ రెవెన్యూ ఇతర సిబ్బందితో ప్రశాంత వాతావరణంలో ఓటర్లందరూ నిర్భయంగా ఓటింగులో పాల్గొనే విధంగా తగిన చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, సిపిఓ జి రామారావు, నర్సీపట్నం ఆర్డిఓ హెచ్.పీ జయరాం, నర్సీపట్నం పాయకరావుపేట ఎలమంచిలి అనకాపల్లి చోడవరం మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, తాసిల్దార్లు ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్ పో వల్ల పిల్లల్లో సైన్స్ పట్ల పెరగనున్న ఆశక్తి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): పాఠశాలల్లో సైన్స్ ఎక్స్ పో లు నిర్వహించడం వల్ల పిల్లల్లో సైన్స్ పట్ల ఆసక్తి బాగా పెరుగుతుందని రవీంద్ర భారతి పాఠశాల మాథ్స్ హెచ్ఒడి అనురాధ కామేశ్వరి తెలిపారు. లా నన్స్ బే కాలని రవీంద్రభారతి పాఠశాలలో జరిగిన సైన్స్ ఎగ్స్పో సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం లోని పలు అంశాలను నమూనాల, నివేదికల రూపంలో ప్రదర్శించడం వల్ల విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కలగడంతో పాటుగా మంచి ఆశక్తి కలుగుతుం దన్నారు. ఇటువంటి వేదికను రవీంద్ర భారతి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వాస్తవికమను వెలికి తీయడానికి ఉపకరిస్తుందన్నారు. పరిశోధనలోని పదార్థాలు, సాధనాలు నమూనాల ద్వారా విజ్ఞాన శాస్త్ర పరిధిని అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న బి.ఒ.ఎస్ వైర్పర్సన్ బి.సుజాత మాట్లాడుతూ ప్రాజెక్టుల పనిని ఇతరులతో పంచుకోవడం వల్ల ఆ భావనలపై అవగాహన పెరిగి తద్వారా మిగిలిన విద్యార్థులకు కూడా భాగస్వాములు కావాలన్న భావన కలుగుతుం దన్నారు. పరిశోధన, ప్రయోగాలు, ప్రతి అశ్చర్యకరమైన విశ్లేషణ మరింతగా విజ్ఞాన శాస్త్రములోని మెళకువలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల మేధాశక్తి అభివృద్ధి జరుగుతుం దన్నారు. రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ మణి తన సందేశంలో భవిష్యత్ కాలములో విజ్ఞానశాస్త్రముదే అంతిమవిజయ ముగా ఉండే తరుణములో విద్యార్థులు మరింతగా రాణించి దేశ ప్రఖ్యాతిని ఇనుమ డింపజేయాలనీ, విద్యార్థులను అభినందిస్తు ఆశీర్వదిస్తున్న నన్నారు. ఉత్తరాంధ్ర ఇంచార్జీ ఎన్.వెంకటేష్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ నుండే విజ్ఞాన శాస్త్రంలోని మెలకువలను తెలుసుకుని రాణించడం ద్వారా భవిష్యత్తు అద్భుతంగా, అమోఘముగా ఉంటుందని తద్వారా దేశానికి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఒ.సాయిసౌందర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు, నమూనాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

మార్చి 3 నుండి బాలల సినీ ఉత్సవం

విజయనగరం, (విశాఖ సమాచారమ్): విజయనగరంలో తొలిసారి బాలల సినీ ఉత్సవం (చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్) నిర్వహించనున్నామని ఎన్ సి ఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ ఆహ్వాన ప్రతులను విడుదల చేసి మాట్లాడుతూ ఈ ఉత్సవం కోసం ఒక కమిటీ వేసారని, కమిటీకి తాను ఛైర్మన్‌గాను, మండా రవి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గాను, నారాయణం నిత్య, ధవళ వెంకటరావులు కో- ఛైర్మన్ లు గాను వ్యవహరిస్తున్నారు. మార్చి 3వ తేదీనుండి 15వ తేదీ వరకు కామెడీస్ ఆఫ్ చార్లీ చాప్లిన్ అనే పేరుతో బాలల సినీ ఉత్సవం నిర్వహించనున్నామని అన్నారు. ఈ ఉత్సవం రోటరీ క్లబ్ ఫోర్ట్, విజయనగరం ఫిలిం సొసైటీ, ఎన్ సి ఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండా రవి, రోటరీక్లబ్ ఫోర్ట్ అధ్యక్షులు డాక్టర్ సంతోష్, సెక్రటరీ అభిషేక్, రిక్కీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

17.50 లక్షల రూపాయలతో నౌకానగర్ పార్క్‌అభివృద్ధి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు విశాఖనగర అభివృద్ధిలో భాగంగా విశాఖ తూర్పు నియోజవర్గంలో 20వ వార్డు శివాజీపాలెం లోఉన్న నౌకానగర్ పార్క్ అభ్యాధునిక సౌకర్యాలతో 20 వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేశ్ కార్పొరేషన్ నిధులు 17.50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో 20వ వార్డు ప్రెసిడెంట్ రవి కిరణ్ రెడ్డి, వార్డు ఎలక్షన్ ఇంచార్జి మురళి, కన్వీనర్స్ దువ్వి గోవింద్, హేమలత, వెంకటేష్, విశాఖ జిల్లా యువజన విభాగం జెనరల్ సెక్రెటరీ సుమంత్, సెక్రెటరీ యనమరెడ్డి రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు 10 వేల రూపాయల సహాయం అందజేసిన ఎం.వి.వి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఇంటికొచ్చి ఆర్థిక సాయంతో పాటు భరోసా కల్పిస్తున్న ఆపద్బాంధవుడు తమ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎం.వి.వి సత్యనారాయణ అని అంటూ ప్రజలు జేజేలు పలుకుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్థానికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది వచ్చినా ఎప్పుడు ప్రజల కోసమే పని చేసే నాయకుడు మాకు కావాలంటూ అక్కడి నాయకులు కార్యకర్తలు జై ఎం.వి.వి అంటున్నారు. ఈమేరకు స్థానికజీవీఎంసీ 22వ వార్డ్ మంగాపురికానీ ప్రాంతానికి చెందిన ఏ యుగాంధర కు అనారోగ్యము కారణముగా బాధపడుతున్న ఆమెను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని విశాఖ లాసన్స్ బేలానీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎం.వి.వి అందజేశారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలకు భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం: లెండీ ఇంజనీరింగ్ కళాశాలలో, సెంచూరియన్ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి భవనాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ప్రతి అంతస్తును, భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా గదుల వైశాల్యాన్ని, వసతులను తెలుసుకున్నారు. స్ట్రాంగ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పార్కింగ్ ఏర్పాట్లకు అవసరమైన స్థలాలను, భవనాలను గుర్తించారు. ప్లాన్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఆయా కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో చర్చించారు.

ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్ఓ ఎస్డి అనిత, ఆర్డిఓ ఎంవి సూర్యకళ, డెంకాడ తాశిల్దార్ జె.రామారావు, విజయనగరం తాశిల్దార్ ఏవి రత్నం, లెండీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎవి రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డిప్యూటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ శంఖారావం సభకు బయలుదేరిన టిడిపి శ్రేణులు

పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా అధ్వర్యంలో రావాడ పంచాయితీ నుండి శనివారం వేసగుంట లో జరగనున్న నారా లోకేష్ శంఖారావం సభకు భారీ ఎత్తున బయబేరిన టిడిపి శ్రేణులు.

సమత కళాశాలలో బాల్ బ్యాట్మింటన్ (మెన్) ద్వితీయస్థానం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సమత కళాశాలలో బాల్ బ్యాట్మింటన్ (మెన్) ద్వితీయస్థానం దక్కించుకుంది. దీనికి ముఖ్యఅతిథులుగా ప్రొ.ఎన్.విజయమోహన్, ఏయూ, ఫిజికల్ డైరెక్టర్, డా.జి.వెంకటేశ్వరరావు, ఐపీఈ, ఫిజికల్ డైరెక్టర్, కళాశాల డీన్ విజయరవీంద్ర, సెక్రటరి రవీంద్ర, సమతా కళాశాల డైరెక్టర్ & ఐసి ప్రిన్సిపాల్ - ప్రొ.జి. శ్రీనివాసరావు, ఏవీఎన్ కళాశాల పిడి- గోపి, జేపీసీ కళాశాల పీడీ- గౌరి, గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్ పీడీ డా. కిరణ్మయి, ఎస్టి.జోసెఫ్ కాలేజ్ పీడీ డా.ప్రవీణ్ కుమార్, సమతా కళాశాల పీడీ జి.రామకృష్ణ అభినందనలు తెలిపారు.

ఈనెల 21న చోడవరంలో మెగా జాబ్ మేళా

చోడవరం, (విశాఖ సమాచారమ్): ఈనెల 21న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాధాకృష్ణ కు ప్రకారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 10, ఇంటర్, డిగ్రీ, ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాను చోడవరం పరిసర ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

గొన్న కళాశాలలో సనాతన ధర్మంపై అవగాహన సదస్సు

పరవాడ, (విశాఖ సమాచారమ్):స్థానిక గొన్న కళాశాలలో సనాతన ధర్మం యొక్క ప్రాముఖ్యత తెలియజేయుటకు శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్వామీ శ్వసం వెద్యనంద జీ మహారాజ్ , సెక్రటరీ ఆఫ్ రామకృష్ణ మిషన్ ఆశ్రమ, విశాఖపట్నం విచ్చేసారు. సనాతన ధర్మం మన నిత్య జీవితంలో ఏ విధమైన ప్రాముఖ్యత పుందో తెలియజేసారు. స్వామీజి మాట్లాడుతూ సనాతన ధర్మం వ్యక్తిగత ఎదుగుదలకు మరియు స్వీయ-

సాక్షాత్కారానికి కీలకం అని తెలిపారు. మీ ధర్మాన్ని కనుగొనడం ద్వారా మరియు దానిని నెరవేర్చడానికి నిలకడగా కృషి చేయడం ద్వారా, మీరు జీవితంలో ఉద్దేశ్యం, దిశ యొక్క భావాన్ని అనుభవించవచ్చు, మీకు నిజమైన మీ లోతైన విలువలు మరియు నమ్మకాలకు అనుగుణంగా జీవించవచ్చు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఎస్ ఎస్ మూర్తి గారు, విభాగ అధిపతులు, ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీలో బీజేపీ అభ్యర్థే సీఎం.. !

ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఎన్నికలు సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి. ఇప్పటికే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. తమ కూటమిలోకి బీజేపీని కూడా ఆహ్వానించే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసి వచ్చారు. బీజేపీ కూడా టీడీపీ, జనసేన కూటమిలో చేరడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో బీజేపీ ఏపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వేరే పార్టీలను తమ భుజాన మోయడానికి తాము సిద్ధంగా లేమని వ్యాఖ్యానించారు. బీజేపీ అభ్యర్థే ఏపీలో సీఎంగా ఉంటారని హాట్ కామెంట్స్ చేశారు. తమతో వివిధ పార్టీలు పొత్తు పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఏపీలో బీజేపీని అధికారంలోకి తేవడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

గుజరాత్ లో గతంలో బీజేపీకి ఒకే సీటు ఉండేదని.. ఇప్పుడు తాము అక్కడ అధికారంలో ఉన్నామని విష్ణువర్ధన్ రెడ్డి గుర్తు చేశారు. ఇలాగే ఆంధ్రప్రదేశ్ లో కూడా బీజేపీ అధికారం సాధిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని.. తమ పార్టీ అభ్యర్థే సీఎంగా ఉంటారని వ్యాఖ్యానించారు. 2014తో పోలిస్తే 2024 ఎన్నికలకు తేడా ఉంటుందని చెప్పారు.

ఇప్పటివరకు ఏపీలో తమకు, జనసేనకు మాత్రమే పొత్తు ఉందని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రతిపక్ష నేతగానే చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారని తెలిపారు. వైసీపీ వైఫల్యాలు, దౌర్జన్యాలను వివరించేందుకు ఫిబ్రవరి 21 నుంచి పోరు యాత్ర చేపడతామని వివరించారు.

తెలంగాణలో తరిమేసిన పర్మిలను తెచ్చి ఏపీ పీసీసీ అధ్యక్షురాలిని చేశారని విష్ణువర్ధన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. పర్మిలను అడ్డికి తెచ్చి అధ్యక్షురాలిని చేశారని.. అంతకంటే సమర్థులు కాంగ్రెస్ కు రాష్ట్రంలో ఎవరూ దొరకలేదా అని నిలదీశారు.

ఈ నేపథ్యంలో విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. ఇప్పటికే వైసీపీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఏడో జాబితాను కూడా ప్రకటించింది. మరోవైపు ఇంతవరకు టీడీపీ, జనసేన తమ అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీతో పొత్తు కోసమే ఆ రెండు పార్టీలు ఎదురు చూస్తున్నాయి. పొత్తుకు బీజేపీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే అభ్యర్థులను ప్రకటించాలని చూస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థే సీఎంగా ఉంటారని, వేరే పార్టీలను తమ భుజాన మోయడానికి తాము సిద్ధంగా లేమని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

13వ వార్డులో బాక్స్ కల్వర్టు ను ప్రారంభించిన ఎం.వి.వి సత్యనారాయణ

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ స్థానిక జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణ పురం లో జీవీఎంసీ నిధులు రూ 36.50లక్షల రూల వ్యయముతో నిర్మించిన బాక్స్ కల్వర్టును శనివారం పార్లమెంట్ సభ్యులు, తూర్పు వైసిపి సమన్వయకర్త ఎం.వి.వి సత్యనారాయణ వార్డు కార్పొరేటర్ కెల్లా సునీతా సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశాఖను పరిపాలన రాజధాని చేయనున్నసేపద్యంలో విశాఖను స్మార్ట్ సిటీగా తీర్చు విధంగా ఇప్పటికే ఎన్నో సంక్షేమ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విశాఖలో స్మార్ట్ సిటీలో భాగంగా మరింత అభివృద్ధి చేయుటకు గాని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. కోట్ల రూపాయలతో ఎన్నో ఆధునికరణ పనులు చేపట్టామని ఎం.వి.వి తెలిపారు. కార్యక్రమంలో కెల్లా సత్యనారాయణ,వైసీపీ వార్డ్ సీనియర్ నాయకులు,గ్రామపెద్దలు మహిళలు, పార్టీ శ్రేణులు గ్రామ పెద్దలు,జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి ఇక "సంసద్ మహారత్న" ..!

వైసీపీ రాజ్యసభ ఎంపీ, పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా కూడా ఉన్న విజయసాయిరెడ్డికి అరుదైన గౌరవం లభించింది. రాజ్యసభ చర్చల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న విజయసాయి రెడ్డి పనితీరుకు బెస్ట్ పార్లమెంటేరియన్ గా సంసద్ రత్న అవార్డు లభించింది. విజయసాయిరెడ్డిని సంసద్ మహారత్న అవార్డుకు ఎంపిక చేస్తూ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఏటా బెస్ట్ పార్లమెంటేరియన్లకు ఇచ్చే ఈ పురస్కారాన్ని సాయిరెడ్డి ఇవాళ అందుకున్నారు.

ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సంసద్ మహారత్న అవార్డు అందుకున్నారు. రవాణా,పర్యాటక సంస్కృతిక పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్ హోదాలో ప్రతిష్టాత్మకమైన సంసద్ మహా రత్న అవార్డును ఈయన అందుకున్నారు. పార్లమెంటరీ స్థాయి సంఘం మాజీ చైర్మన్ టీజీ వెంకటేష్ కూడా ఈ అవార్డుల కార్యక్రంలో పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్ తమిళి సై, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్ రాజ్ అహిర్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ఈ అవార్డులను అందజేశారు. 17వ లోక్ సభ కాలంలో టూరిజం, రవాణా, సాంస్కృతిక శాఖ పార్లమెంట్ స్థాండింగ్ కమిటీ చైర్మన్ గా అత్యుత్తమ పనితీరుకు గాను ఈ అవార్డు విజయసాయిరెడ్డి దక్కింది

సంసద్ రత్న అవార్డ్ 2024 14వ ఎడిషన్‌లో ప్రతిష్టాత్మకమైన సంసద్ మహా రత్న అవార్డును అందుకునందుకు కృతజ్ఞతలు తెలుపుతూ గౌరవంగా భావిస్తున్నట్లు సాయిరెడ్డి ట్వీట్ చేశారు. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై పార్లమెంటరీ స్థాండింగ్ కమిటీ ద్వారా తన సహకారానికి గుర్తింపు లభించిందన్నారు. ఈ అవార్డు 17వ లోకసభ కాలంలో తన అంకితభావానికి, ప్రభావానికి నిదర్శనమన్నారు. సంసద్ రత్న, సంసద్ మహారత్న, సంసద్ ఉత్కృష్ట మహారత్న అవార్డులు అందుకున్న వారిలో ఎంపీలు అధిర్ రంజన్ చౌదరి, భర్తృహరి మహతా, సుప్రియా సులే, శ్రీకాంత్ ఏక్ నాథ్ షిండే, హీనా గవిట్, జయంత్ సిన్హా, గద్ది గౌడ, సుదీర్ గుప్తా, అమోల్ రాంసింగ్ కొల్హే, రాజ్ శర్మ ఉన్నారు.

తిరుమలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు..!

తిరుమలకు దేశ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు నిత్యం వస్తు ఉంటారు. వీరిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో అందరు ఎమ్మెల్యేలకు తిరుమలకు దర్శనం, వసతి కోసం సిఫార్సు లేఖలు ఇచ్చే అవకాశం ఉండేది. రాష్ట్ర విభజన తరువాత ఎమ్మెల్యేలకు సిఫార్సు లేఖలు ఇవ్వటం లేదు. టీటీడీ బోర్డులో తెలంగాణ కోటాలో మాత్రం సభ్యులను నియమిస్తున్నారు. తెలంగాణ మంత్రులు, ప్రముఖులకు మాత్రం వీఐపీ దర్శనం అందుతోంది.

సామాన్య భక్తులు తిరుమలకు తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే సమయంలో ఎమ్మెల్యేలను లేఖలు కోరుతున్నారు. దీంతో, ఏపీ ఎమ్మెల్యేల తరహాలోనే తెలంగాణ ఎమ్మెల్యేలకు దర్శనం, వసతి కోసం సిఫార్సు లేఖలు ఇచ్చేలా అనుమతించాలని ఏపీ ప్రభుత్వం ,టీటీడీని తెలంగాణ ప్రభుత్వంలోని కొందరు సంప్రదించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తు ఉంటారు. ఏపీలోని ఎమ్మెల్యేలకు కోటా విధించి..నిబంధనలకు అనుగుణంగా దర్శనం వసతి కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఎమ్మెల్యేలకు పరిమితి సంఖ్యలో సిఫార్సు లేఖలు అనుమతించేలా చర్యలు తీసుకొనేలా సంప్రదింపులు చేస్తున్నామని కోమటిరెడ్డి వివరించారు.

ప్రస్తుతం తిరుమలలో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన సిఫార్సు లేఖలను రోజుకు ఒక్కొక్కరి నుంచి ఒకటి మాత్రమే అనుమతిస్తున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనాల సమయాల్లోనూ మార్పులు చేసారు. వారంలో ఒక రోజు పూర్తిగా బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలను అనుమతించటం లేదు. స్వామికి ప్రత్యేక కార్యక్రమాలు, పర్వదినాల రోజుల్లో సిఫార్సు లేఖలను స్వీకరించటం నిలిపివేస్తున్నారు. ప్రముఖులు ప్రత్యక్షంగా వస్తే వారికి దర్శనం కల్పిస్తున్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా టికెట్లు అమ్మకాలు పెరిగాయి. ఇదే సమయంలో తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల నుంచి ప్రముఖులు సిఫార్సు లేఖలతో వచ్చిన వారికి అవకాశానికి అనుగుణం గా దర్శనం కల్పిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలకు సిఫార్సు లేఖలు అనుమతించాలనే తాజా అభ్యర్థన పైన ఎలాంటి నిర్ణయం ఉంటుందనేది చూడాలి.

జిల్లా లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. శనివారం కార్యాలయంలో జిల్లాలోని ఎంపీడీవోలు జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ గ్రాంట్లక్రింద విడుదలైన నిధులను వేగంగా ఖర్చు చేయాలన్నారు. ప్రాధాన్యతా భవనాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పూర్తి కావచ్చిన పనులను పూర్తి చేయాలన్నారు. గుత్తేదారులతో మాట్లాడి పనులను పూర్తి చేయించాలన్నారు. ఇతర గ్రాంట్లక్రింద విడుదలైన నిధులను, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను వినియోగించి అవసరమైన పనులను చేయించేలా చూడాలన్నారు. త్వరలో రానున్న ఎన్నికలలో ముందస్తు పనులలో ఎంపిడివోలకు కేటాయించిన పనులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఈఆర్ వోల సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ పనులు, ఎన్నికల పనులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ

సమావేశంలో డి ఆర్ డి ఏ పి డి శచిదేవి, గ్రామ వార్డు ఒలంటీర్ల ప్రత్యేక అధికారి మంజులవాణి, డి ఎల్ డి వో అరుణ శ్రీ, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ హేమంత్, డ్రామా పీడీ ఈ నందీప్, డిపిఓ ఆర్ శిరీష రాణి జిల్లాలోని ఎంపీడీవోలు పాల్గొన్నారు.

19న అనకాపల్లిలో జరుగు లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయండి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సందర్భంగా తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ మాట్లాడుతూ నారా లోకేష్ శంఖారావం అనకాపల్లిలో ఫిబ్రవరి 19వ తారీఖున సాయంత్రం నాలుగు గంటలకు జె ఎం జె స్కూలు ఎదురుగా గల ప్రదేశంలో జరుగుతుందని సాయంత్రం నాలుగు గంటలకు నారా లోకేష్ సభా ప్రాంగణం కు విచ్చేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని తెలియజేశారు. తెలుగు ప్రాంత అభివృద్ధి కోసం, తెలుగు ప్రజల సంక్షేమం కోసం నారా లోకేష్ యువగలం పాదయాత్ర 26 రోజులపాటు కొనసాగించి, 97 నియోజకవర్గాలు, 2094 గ్రామాలలో పర్యటన చేసి 3132 కిలోమీటర్లు నడిచి ప్రజల యొక్క ఇబ్బందులను కష్టాలను తెలుసుకున్నారని ఇప్పుడు శంఖారావం ద్వారా కార్యకర్తలు, ప్రజలతో మమేకమవ్వాలి అనే ఉద్దేశంతో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీల సారథులుగాని, క్లస్టర్ ఇంచార్జిలు గాని, యూనిట్ ఇన్చార్జీలు గాని, సాధికార సమితి సభ్యులు గాని వీరితోపాటు గ్రామాల్లో ఉండే పూర్వపు కార్యకర్తలను, నాయకులను, ఎంపీటీసీలను, సర్పంచులను, ఎన్టీఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు అందరూ కూడా ఈ సభకు విచ్చేసి శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా నారా లోకేష్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.

ఘనంగా ముగిసిన రథసప్తమి వేడుకలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి మండలం రాజుపాలెం గ్రామంలో వెలిసిన శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా ముగుసాయి. శుక్రవారం రాత్రి వరకు ఎన్నడులేని విధంగా ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. రథసప్తమి సందర్భంగా ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మందు గుండు సీతారామయ్యగారి బాణాసంచా హంగామాను ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు,

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల బాబురావు, ఆలయ వైస్ చైర్మన్ కఠి కోటేశ్వరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్,గొల్లవిల్లి నర్సింగరావు, బండారు వెంకటరమణ , బండారు రమణ, బండారు ఆదిబాబు, గొల్లవిల్లి చిరంజివి, గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, సిదిరెడ్డి సూకరాజు,అందే బాబురావు, గొల్లవిల్లి వాసు, అందే తరకేశ్వరరావు, గొల్లవిల్లి రవికుమార్, రాంకుమార్, గొల్లవిల్లి రాజు, గొల్లవిల్లి నాగేశ్వరావు, జగ్గారావు, కఠి రవికుమార్, మామిడి సూరిబాబు, కరణం కేశవరావు, గొల్లవిల్లి త్రినాథ్, అగ్రహరపు వెంకటబొర, ఏలిశెట్టి ఆదిబాబ, పాల్గొన్నారు. అలాగే స్థానిక సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలోని ఆదిత్యని రథసప్తమి వేడుకలు అత్యంత ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేఏం నాయుడు, ఈవో ఆదినారాయణ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అద్భుతం

పాడేరు, (విశాఖ సమాచారమ్): గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలు అద్భుతం అని వారి వల్లే వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని పేదలకు మెరుగైన సేవలను అందించగలుగుతున్నామని పాడేరు శాసనసభ్యులు శ్రీమతి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. జికే వీధి మండలంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులు పొందిన వాలంటీర్లకు పురస్కారాలను అందజేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జికే వీధి మండలంలో 316 మంది వాలంటీర్లకు అవార్డులు పరించాయని వారిలో 311 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న అవార్డులు రావడం జరిగిందని అవార్డు పొందిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి శుభాభినందనలు తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రజలకు చేరవేసే విధంగా ఇప్పటివరకు సంక్షేమ పథకాలు ముఖం కూడా చూడనటువంటి వారికి కూడా వారి దరికి చేర్చినటువంటి వ్యక్తులు వాలంటీర్లు అన్నారు. గిరిజన ప్రాంతంలో వాలంటీర్ వ్యవస్థ ఒక కొత్త చరిత్రను తిరగరాసిందని కొత్త పాలన విధానానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థతో గిరిజనులకు జరిగిన మేలు ఇతర ఏ ప్రాంతంలో కూడా జరిగి ఉండదని ఆమె పునరుద్ఘాటించారు. మిగిలిన రాష్ట్రాల్లో కూడా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనేటువంటి ఒక కొత్త ఆలోచనకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక నమూనా కావడం సంతోషదాయకమన్నారు. గతంలో సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్రాలకు అవార్డు రూపంలో అందజేసినటువంటి పారితోషికాన్ని కూడా పెంచడం జరిగిందని సేవా మిత్రాకు 15000 సేవా రత్నాకి 30,000 సేవా వజ్రాకు 45000 ఈ ప్రభుత్వం పెంచి ఇస్తున్నట్లుగా భాగ్యలక్ష్మి గారు వెల్లడించారు. సేవ చేసే వ్యక్తులను గౌరవించాలి అనేటువంటి ఆలోచన అద్భుతమని ఈ ఆలోచన ద్వారా ప్రజలకు వాలంటీర్ల ద్వారా మరింత సేవలు అందించాలనే పోటీ తత్వాన్ని ప్రేరేపించడం.... ప్రతి ఒక్కరూ తమకు తాముగా అవార్డు పొందాలి అనేటువంటి లక్ష్యాలు నిర్దేశించుకునేలా ప్రభుత్వం ఆలోచన చేయడమైనది శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జడ్పిటిసి మత్స్యరాన శివరత్నం, ఎంపిటిసి పనువులేటి నాగమణి, సర్పంచ్ కొర్ర సుభద్ర, జర్ర ఎంపిటిసి ఏ లోవలక్ష్మి, బొమ్మరేవుల సర్పంచ్ ఎం కమల, ధారకొండ సర్పంచ్ ఎం రాజు, దారకొండ ఎంపీటీసీ ఎం రామన్న, సర్పంచ్ పి దుర్గి, చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, వైస్ సర్పంచ్ కొర్ర రాంబాబు , సీనియర్ నాయకులు అడపా విష్ణుమూర్తి, పీ ఏ సీ ఎస్ చైర్మన్ వి. అరుణ్ కుమార్ , బీసీ సెల్ అధ్యక్షులు పిల్లా బుజ్జి, వైసిపి నాయకులు గిరి ప్రసాద్ తరులు పాల్గొన్నారు.

మరల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి 2024 ఎన్నికలకు ఫిబ్రవరి 18న ఆంధ్రప్రదేశ్ దళ, దిశా మారే విధంగా విడుదల చేస్తున్న మేనిఫెస్టోతో, వైసిపి తో పోటీ పడుతున్న పార్టీలన్నింటికి, మబ్బులు విడిపోతాయని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు అన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టో లో యిచ్చిన హామీలే గాక, అదనంగా ఎన్నో సంక్షేమ పథకాలను, ముందుగా కేలండర్ ప్రకటించి, దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా నేరుగా వంద శాతం ప్రజలకు అందించిన ఘనత జగన్మోహన్రెడ్డి కే దక్కిందన్నారు. విద్య వైద్యంలోనూతన పోకడలు సృష్టించి, ప్రతి ఒక్కరికీ అందించి, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను ప్రథమ స్థానంలో నిలిపారని రమణ అప్పారావు అన్నారు.అమ్మఒడి, నాడు-నేడు, విద్య కానుక, విద్యా దీవెన, గోరు ముద్ద, వసతి దీవెన, ఇంగ్లీషు మీడియం విద్య, విదేశీ విద్యా దీవెన, డిజిటల్ విద్యా, ఉచితంగా ట్యాబ్‌లు, పుస్తకాలు, బట్టలు మొత్తం 71017 కోట్లు నేరుగా ప్రతి విద్యార్థి తల్లులు ఖాతాల్లో వేసి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి విద్యార్థిని సరస్వతి పుత్రులను చేసిన ఘనత జగన్దే నన్నారు. వైద్యంలో ప్రతి మండలానికొక పబ్లిక్ హెల్త్ సెంటర్లు నిర్మాణం, చరిత్రలో లేని విధంగా ఒకే సారి 17 మెడికల్ కాలేజి ల స్థాపన, ఆరోగ్యశ్రీ 25 లక్షల పెంపుతో, ప్రతి ఒక్కరి హృదయాలలో జగన్మోహన్రెడ్డి నిలచి పోయారన్నారు.మిగతా పార్టీలు ఎన్ని హామీలిచ్చినా, ఎన్ని కుయుక్తులు పన్నినా జగన్మోహన్రెడ్డే, మరల ముఖ్యమంత్రి కావటం ఖాయమని రమణ అప్పారావు అన్నారు.

అల్లర్లు, సమస్యలు సృష్టించే వారిని గుర్తించాలి పాత నేరస్థులను బైండ్ ఓవర్ చేయాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి, దర్యాప్తు లో ఉన్న సాధారణ, తీవ్రమైన మరియు ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి. కేసులు, గంజాయి కేసులు మరియు మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఆయా పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ, గ్రామసభలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరుతుంటలు చేయాలన్నారు. ముందస్తు సమాచారం సేకరించాలన్నారు.

ఎన్ఫోర్స్మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక/ అసాంఘీక కార్యక్రమాలను కట్టడి చేయాలన్నారు.

పోలింగ్ కు ముందు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, 107 సి ర్ పిసి నుండి 110 సి ఆర్ పి సి వరకూ గల సెక్షన్ల క్రింద ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తర్వాత అల్లర్లు, సమస్యలు సృష్టించే వారిని గుర్తించాలని, పాత నేరస్థులను బైండ్ ఓవర్ చేయాలన్నారు. పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 12 మంది అధికారులు మరియు సిబ్బందికి ప్రశంసా పత్రాలతో జిల్లా ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ బి.వెంకటరామయ్య, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇనస్పెక్టర్ లు లక్ష్మణ మూర్తి, చంద్ర శేఖర్, ఎస్సై రమువర్మ మరియు జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో బిజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది...నడ్డా



భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని... తనకు ఆ నమ్మకం ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ ఎదిగిందన్నారు. అనేక ఎన్నికల్లో మనం వరుసగా గెలుస్తూ వస్తున్నామని తెలిపారు. గుజరాత్‌లో వరుసగా ఇరవై ఏళ్లకు పైగా అధికారంలో ఉన్నామని, త్రిపురలోనూ మన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అసోంలో, మణిపూర్ రాష్ట్రాలలో రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఇటీవలే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చామన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. సంకల్పించిన అన్ని పనులను మోదీ పూర్తి చేశారని తెలిపారు. ఒక్కోసారి ఓటమిలోనూ విజయం ఉంటుందని... ఇందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ ఉదాహరణ అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లు గెలుచుకున్నామన్నారు. తెలంగాణలో ఓటింగ్ శాతం 7.1 నుంచి 14 శాతానికి చేరుకుందని తెలిపారు. తెలంగాణలో మనకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్ అని తెలిపారు. జల్ మిషన్‌లో భాగంగా 11 కోట్ల మందికి సురక్షిత మంచినీటిని అందిస్తున్నట్లు తెలిపారు.

మన దేశ రాజకీయ స్థితిగతులను ప్రధాని మోదీ మార్చివేశారన్నారు. మోదీ నాయకత్వంలో బీజేపీ గరీబ్, యువ, రైతు, మహిళా శక్తిని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతోందన్నారు. దేశాన్ని ముందంజలో ఉంచడంలో వీరి పాత్ర ఉంటుందన్నారు. దేశంలో ముప్పై ఏళ్ల తర్వాత బీజేపీ మాత్రమే సంపూర్ణ మెజార్టీతో 2014లో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. తొలుత భారతీయ జన సంఘ్, ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు బీజేపీ గడిచిన ఏడు దశాబ్దాలలో ఎన్నో ఉత్థానపతనాలను చూసిందన్నారు. ఎమర్జెన్సీని కూడా చూశామని... కానీ గత దశాబ్ద కాలంలో మోదీ నాయకత్వంలో ఎన్నో విజయాలను సాధించడం మరింత సంతోషకరమన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా కదిరి రాము నియామకం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా విశాఖపట్నానికి చెందిన న్యాయవాది, సంఘ సేవకుడు, మానవ హక్కుల కార్యకర్త కదిరి రాము నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి శుక్రవారం నియామక పత్రం జారీ చేశారని కదిరి రాము ఒక ప్రకటనలో తెలిపారు . కదిరి రాము విశాఖపట్నం బీఎస్పీ జిల్లా కన్వీనర్ గాను ,విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి గాను సేవలందించారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కదిరి రామును ఇటీవల అధిష్ఠానం ప్రకటించడం విశేషం.

బహుజన్ సమాజ్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని కదిరి రాము పేర్కొన్నారు. ' మార్పు రావాలి- తీర్పు మారాలి ' అని పేర్కొంటూ, ' సామాన్యుడే శాసన కర్త ' , అది ఒక్క బీఎస్పీ తోనే సాధ్యమని ఆయన ఉద్ఘాటించారు. సామాన్యుల ,పేదల, మధ్యతరగతి ప్రజల భరోసా బీఎస్పీ అని కొనియాడారు .రాష్ట్ర కార్యదర్శి పదవి,బాధ్యతల నిర్వహణలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ప్రతిష్ఠాత్మకమైన పదవి ,బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి కి, సహకరించిన సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎమ్ .బాలన్న, రాష్ట్ర కో - ఆర్డినేటర్ ,మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు లకు కదిరి రాము కృతజ్ఞతలు తెలిపారు . బీఎస్పీ నాయకులు పెదపెంకి శివప్రసాదరావు, పీరు బండి ప్రకాశరావు,బొని కృష్ణ, ప్రభాకర్ రావు, దివకాల గంగరాజు, పెద్దాడ మహాలక్ష్మి, సవరాల రమేష్ , అతికం శెట్టి రామచంద్ర రావు,బి. చిన్నారావు,డా.ఎస్ జయరాజ్, పి జె సుధాకర్, నాగార్జున శాక్య, ఆరుగుల ధనంజయ రావు, బంగారి రమణ, కణితి దేముడు, పొట్టి రజనీకాంత్ ,కటారి దుర్గా భవాని ప్రసాద్ ,లక్ష్మీ స్పెరో, నందికోల్ల అప్పారావు, సనపల సత్యవతి, కల్లేపల్లి మహాలక్ష్మి , గూనాన సురేష్ లతో పాటు,పలువురు బహుజన కార్యకర్తలు, సంఘ సేవకులు, రాజకీయ నాయకులు కదిరి రాము కు అభినందనలు తెలిపారు.

Sugar Free
Fitearly
సడిపయస్సులకు దివ్య శక్తి
ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन
फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరిక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించు కోబడిన ఉపాహారం

ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED
HEALTH AND HAPPINESS
Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa, Street No 16, Amberpet, Hyderabad - 500013, Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

నీటిపై తేలియాడే వంతెనను పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ సాగర తీరంలో పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్న నీటిలో తేలియాడే వంతెన(ఫ్లోటింగ్ బ్రిడ్జి)ను జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున పరిశీలించారు. విక్టరీ ఎట్ సీకి సమీపంలో బీచ్ వైపు ఏర్పాటు చేస్తున్న వంతెనను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, వీఎంఆర్డీఏ, పోలీసు అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అధికారులు, నిర్వాహకులతో కలిసి కాసేపు బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జికి అదనపు సొబగులు తీర్చిదిద్దాలని, భద్రతాపరమైన చర్యలు పటిష్టంగా చేపట్టాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. అలల తాకిడికి పర్యాటకులు ఇబ్బంది పడకుండా వంతెనకు అటూ ఇటూ గట్టిగా బలమైన రోప్ లు ఏర్పాటు చేయాలన్నారు. బీచ్ నుంచి సుమారు 100 మీటర్ల మేర సముద్రంలోకి వేసిన వంతెనపై నడిచి వెళ్లిన ఆయన ఒక కొత్త అనుభూతిని పొందినట్లు చెప్పారు. చాలా ఇంటరెస్టింగ్ గా ఉందని అభిప్రాయపడ్డారు. చూడడానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. గజ ఈతగాళ్లు వంతెనపై నిత్యం ఉండేలా చూడాలని, వంతెనకు రెండు వైపులా లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు తప్పకుండా తీసుకోవాలని, నిబంధనల మేరకు కార్యకలాపాలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తైన వెంటనే కార్యకలాపాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇదే తొలి ప్రాజెక్టు

ఇలా నీటిపై తేలియాడే వంతెన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇదే మొదటిదని క్రిసాయి మోక్ష షిప్పింగ్ & లాజిస్టిక్స్ ప్రతినిధి సుదర్శన్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు రూ.1 కోటి వరకు అవుతుందని చెప్పారు. వీఎంఆర్డీఏ అధికారులతో కలిసి కేరళ వెళ్లామని అక్కడ నిర్వహిస్తున్న ఇలాంటి వంతెనలను పరిశీలించామని వివరించారు. అక్కడ వినియోగించిన మెటీరియల్, సాంకేతిక సహాయాన్ని వినియోగించి ఇక్కడ వంతెన ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటలకు రక్షణ కొరకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వంతెన బీచ్ నుంచి 100 అడుగుల మేర సముద్రంలోకి ఉంటుందని, చివరి భాగంలో సముద్రపు లోతు 6-8 అడుగులు ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వంతెన ఇలా నీటిపై తేలియాడి ఉండేందుకు అనువుగా ఇప్పటికే సిమెంటుతో తయారు చేసిన యాంకర్లు 34, ఇనుముతో తయారు చేసిన మరొక రెండింటిని వినియోగించామని తెలిపారు. ఈ వంతెన ఒక్కసారి 200 మంది వెళ్లే సామర్థ్యం కలిగిన ఉంటుందని స్పష్టం చేశారు. వంతెనపై ప్రతి 25 మీటర్లకు ఒక గజ ఈతగాడు ఉండటంతో పాటు పర్యాటకుల వెంట మరొక ముగ్గురు గజ ఈతగాళ్లు ఉంటూ పర్యవేక్షిస్తారన్నారు. వంతెనకు రెండు వైపులా రెండు లైఫ్ బోట్లను నిత్యం అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు కార్యకలాపాలు ప్రారంభిస్తా మని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జన్మదిన వేడుకలు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నం ఆర్కే బీచ్ సమీపంలో గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో తమ్మి రెడ్డి శివశంకర్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు గొప్ప చక్రవర్తిని విజయనగర సామ్రాజ్యాన్ని అద్భుతంగా పాలించా డని దేశభాషలందు తెలుగు లెస్స అని చెప్పిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజాల కొలువు చాలా అద్భుతంగా చూసుకున్నాడని కవులు కళాకారులు రచయితలు వీళ్ళని అద్భుతంగా చూసుకుంటే ఆ సామ్రాజ్యం ఎప్పుడూ విరజిల్లుతూ ఉంటుందని తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు ఈ సందర్భంగా నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మర్రివేముల శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణదేవరాయలు జన్మదినోత్సవంలో నేను పాల్గొనడం నా దృష్టిని భావిస్తున్నాను అని అన్నారు విశాఖ నగర శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు సేనాపతి వెంకటేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కుల మత బేధ ప్రాంతం లేకుండా శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనలో అందర్నీ చక్కగా పరిపాలించాడని అటువంటి చక్రవర్తి ప్రపంచంలో ఎక్కడా ఉండడని అటువంటి గొప్ప మహనీయుడు పుట్టినరోజు సందర్భంగా మా సంఘం తరపున ఆయనని ఘనంగా సత్కరించడం మాకు గొప్ప గర్వకారణమని సేనాపతి వెంకటేష్ అన్నారు ఈ సందర్భంగా విశాఖపట్నం ఎమ్మెల్సీ జనసేన సిటీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవం నగర విశాఖ కాపు యువజన సేవా సంఘం చేయడం చాలా అద్భుతమైన కార్యక్రమం అని కొనియాడారు ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు సంకు వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అద్భుతమైన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాలని సింహాచలం ప్రాంతాన్ని చాలా అద్భుతంగా అభివృద్ధి చేశాడని చెప్పి కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు మజ్జి దేవత్రి మారిశెట్టి నాగేశ్వరరావు అన్నం తిరువతి నాయుడు సమయం హేమంత్ కుమార్ శనపతి భవాని శంకర్ తాడి నాగరాజు మంచి పని ఈశ్వరరావు గుర్రం కనకారావు లంక శ్రీనివాస్ జెర్రిపోతుల ముత్యాలు మధుపాద రవి సారిపిల్లి కౌశిక శంబాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చే లోపలే ప్రిపరేటరీ పనులు పూర్తి చేయాలి

విజయనగరం: ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసే లోపలే పోలింగ్ కేంద్రాల ప్రిపరేటరీ పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల శిక్షణలు, నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలకే సమయం సరిపోతుందని అన్నారు. ఎన్నికల సన్నద్ధత పై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం లో శనివారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల మార్పు, భవనాల మార్పులు ఏమైనా ఉంటె ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. మార్పులు ఉంటే సహేతుకమైన కారణాలను కూడా రాయాలన్నారు. ఈ విషయం లో రాజకీయ పక్షాల ప్రతినిధులతో కూడా చర్చించి ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రతిపాదనలు పంపాలన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పులనే చేయగలం తప్ప కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు వీలు కాదని స్పష్టం చేసారు. ఎన్నికలకు అవసరమగు మాన్ పవర్ , వాహనాల అవసరత, పోలింగ్ స్టేషన్లలో ఇంటర్నెట్ కనెక్షన్ తదితర అవసరాలను రిటర్నింగ్ అధికారులు ముందుగానే చూసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో కనీస అవసరాలను తనిఖీ చేయాలని, లేని యెడల వెంటనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ , లైట్లు, ఫ్యాన్ లు, రాంప్ లు, తాగు నీరు, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లు అన్నీ గ్రౌండ్ ఫ్లోర్ లోనే తప్పక ఉండేలా చూడాలన్నారు. ఆర్.ఓలు చెక్ లిస్టు పెట్టుకొని అవసరమగు ఏర్పాట్లన్నిటినీ ముందే చూసుకోవలన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా సవరణ కోసం వచ్చిన ఫారాల డిస్పోజల్ 6,8 పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంకను డిస్పోజ్ చేయవలసిన ఫారాలు 2 వేల వరకు ఉన్నాయని, దరఖాస్తు అందిన వారం లోగానే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో జే.సి కార్తీక్, డి.ఆర్.ఓ అనిత, 7 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు ,ఎన్.ఐ.సి అధికారులు, ఎన్నికల డి టి లు తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో సంయుక్త ప్రాజెక్టులను నిర్వహించండి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించాలని అమెరికాకు చెందిన ఈటాన్ రీసర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజనీర్ డాక్టర్ విజయ్ భావరాజుని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆహ్వానించారు. శనివారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విజయ్ భావరాజు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న స్టార్టప్పుకు తాను అడ్వైజర్‌గా సేవలు అందిస్తానని సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పరిశోధనల్లో సంయుక్త భాగస్వామ్యంతో పనిచేయాలని ఆహ్వానించారు. వర్సిటీ తరపున డాక్టర్ విజయ్ భావరాజుని సత్కరించారు. అనంతరం ఎలక్ట్రికఇంజనీరింగ్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి 'చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్' అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులతో పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జున రావు, బిఓఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఇరిగేషన్ యూనిట్లుతో అధిక దిగుబడులు సాధ్యం

పాడేరు, (విశాఖ సమాచారమ్): సోలార్ ఇరిగేషన్ యూనిట్లు వినియోగించి అధిక వ్యవసాయ దిగుబడులు సాధించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. అందుబాటులో ఉన్న జల వనరులను వినియోగించుకుని ఏడాదికి రెండు పంటలు పండించాలని సూచించారు. సిసిడిపి నిధులతో గిరిజన రైతులకు ఐటిడి ఏ కార్యాలయం వద్ద శనివారం సోలార్ ఇరిగేషన్ యూనిట్లను పంపిణీ చేసారు. కొయ్యూరు మండలానికి చెందిన ఆరుగురుకి ఉచితంగా సోలార్ ఇరిగేషన్ యూనిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.15 లక్షల విలువైన సాగునీటి యంత్రాలను గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 110 యూనిట్లు గిరిజన రైతులకు పంపిణీ చేయడానికి లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటి వరకు 103 యూనిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ దిగుబడులు సాధించడానికి గిరిజన రైతులకు అండగా ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి. ఎస్. ప్రభాకరరావు, ప్రాజెక్టు వ్యవసాయాధికారి కె. రూన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘము

ఆధ్వర్యంలో రి.నెం. 72/2016

బ్రాహ్మణ వధూ వరుల వివాహ పరిచయ వేదిక

తేది. 25-02-2024 ఉ॥ గం॥ 9.30 ని॥ ల నుండి

శ్రీ ఆశీర్వాద రైల్వే ఫంక్షన్ హాల్, ధర్మానగర్, కంచరపాలెం, విశాఖపట్నం

For Off line Registration plz Contact :

Smt. Aduri Kalyani @ 0891 - 2534289
Sri Aduri Nageswar Rao @ 7569084081
Sri S.S. Pratap @ 9912833506
Smt. Ramya Sagar @ 7899533399
Sri S.V.R. Murthy @ 9397678826
Sri B.V. Prasad @ 9848127681
Smt. Pogaru Lakshmi @ 9885710983

For On line Registration plz Contact :

Sri P. Satyanarayana @ 8885953378
Sri A. Radha Krishna @ 9490132636

Last Date for Registration : 18-02-2024

మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)

ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718

మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.

ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.

అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24x7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.

సంవత్సరానికి 5 రోజులు ఈ సుభప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.

లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24x7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24x7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టా. గిన్నెలతో సహా కిచెన్.

పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.

24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.

వివరములకు సంప్రదించండి.

9393949345, 8247526179

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676